ఫిబ్రవరి - 2026

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**
సంవత్సర చందా రూ. **350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-




**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| స్టుపిడ్, రాస్కెల్ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| గొప్పగా ఉండాలని... | హన్నాకృప డెస్క్ | 08 |
| సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 0 9 |
| నడిపిస్తున్న దేవుడు | సాక్ష్యము | 10 |
| తెలివిలేదు, యోచింపరు | హన్నాకృప డెస్క్ | 12 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| కలిగిన వాటితో... | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| చూచుచున్న దేవుడు | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-14 | | 24 |


| | |
|---|---|
| సీరియల్ నంబరు | |

సంపాదకీయం....

# గతించిన కాలము చాలును

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

చాలామంది వారిలో వారికి నచ్చని వాటిని జనవరి 1వ తేది నుండి మార్చుకోవా లనుకుంటారు. త్రాగుబోతులు మందు మానెయ్యాలనుకుంటారు, సినిమాలు, సీరియల్స్ చూసేవాళ్ళు ఇంక చూడకూడదు అనుకుంటారు. ఇంకా అనేక చెడు కార్యములు జరిగించేవారు చెడు క్రియలు మానుకోడానికి జనవరి 1ని ముహూర్తంగా ఎంచు కుంటారు. చెడ్డవాటిని మానెయ్యడానికి ముహూర్తం పెట్టుకొనేవారు సరిగ్గా ఆ సమయం రాగానే, వాటిని మానలేక ముహూర్తం వాయిదా వేసుకుంటారు. ఇలా ప్రతి సంవత్సరం ఇదే తంతు ఉంటుంది. వారి హృదయంలో దేవునికి స్థానం లేనందు వల్లన 'ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనము' అన్నట్లు ఉంటాయి వారి నిర్ణయాలు. అందుకు కారణం అన్యజనులతో వారి సహవాసం. అన్యజనుల ప్రభావం వారి మీద ఉన్నందువల్ల దేవుని విషయాలలో వారికి స్థిరత్వం ఉండదు. క్రైస్తవులలోనే దేవున్ని ఎరుగనివారు దేవుని దృష్టిలో అన్యజనులే. చాలా క్రైస్తవ కుటుంబాలలో అన్యసంస్కృతి ఉంటుంది. ఇశ్రాయేలీయులను దేవుడు కనాను దేశములోకి ప్రవేశ పెట్టబోయే ముందు *"మీ హృదయము మాయలలో చిక్కి త్రోవ విడిచి యితర దేవతలను పూజించి వాటికి నమస్కరింపకుండ మీరు జాగ్రత్తపడుడి"* (ద్వితీయో.11:16) అని హెచ్చరించాడు. కనానీయులందరిని ఆ దేశము నుండి వెళ్ళగొట్టకుండా కొంతమందిని దేవుడు ఆ దేశంలోనే ఉండనిచ్చాడు. ఎందుకంటే వారితో స్నేహం చేయకుండా ఉండటానికి అది ఒక పరీక్ష. ఈ రోజుల్లో క్రైస్తవులు అన్యజనుల జీవన విధానానికి ఏ మాత్రం తీసి పోకుండా జీవిస్తున్నారు. అన్యులు రాళ్ళని, రప్పలని, చెట్లని, పుట్లని విగ్రహాలుగా చేసుకుంటే, క్రైస్తవులు ధనమును విగ్రహముగా మలుచుకొని దానిని ఆరాధిస్తుంటారు. దేవుడిచ్చిన దేహమును కేవలం ధనసంపాదనకే వినియోగిస్తూ ధనాపేక్ష కలిగి జీవిస్తుంటారు. అపొస్తలుడైన పౌలు వ్రాస్తూ *"కావున భూమిమీదనున్న మీ అవయవము లను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధన యైన ధనాపేక్షను చంపి వేయుడి"* (కొలస్స.3:5).అని చెప్పాడు. *"క్రీస్తు శరీరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడి"* (1పేతురు 4:1). క్రైస్తవులు క్రీస్తును పోలి నడుచుకోవాలి గాని అన్యజనుల ఇష్టప్రకారం నడవకూడదు. క్రీస్తు రెండవ రాకడ అతి సమీపించియున్న ఈ తరుణంలో మారు మనస్సు పొందకుండా నీ ఇష్ట ప్రకారం జీవించడానికి గతించినకాలమే చాలు. ఈ నూతన సంవత్సరంలో మారుమనస్సు పొందడానికి నీ హృదయంలో దేవునికి చోటివ్వు.

**-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

– కొడవటికంటి

సమృద్ధి సంవత్సరాలు పూర్తి అవుతుంటే, ఐగుప్తీయులు చాలామంది రాబోయే కరవు గురించి, కథలు కథలుగా చెప్పుకున్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఐగుప్తులో పండిన విస్తారమైన పంటతీరు గమనించినవారు, రాబోయే యేడు సంవత్సరాలు కరవు! అని చెప్పి ఎగతాళి చేసారు. కరువు సంవత్సరాలలో మొదటి సంవత్సరం పంట పండకపోయిన తర్వాతనే, రాబోయే కరువు విషయం ఆలోచించడం మొదలు పెట్టారు. ఈ కరువు అన్ని దేశాలలో మొదలయ్యింది. కరవు రెండవ సంవత్సరంలో సమస్త దేశస్తులు ధాన్యం కొనటానికి జప్నత్పనేహు దగ్గరకు రావటం ప్రారంభించారు. కనుక తన తండ్రిచేత తన అన్నలు కూడా ఆహారం కొనడానికి ఐగుప్తు వస్తారని జప్నత్ప యోచించాడు. అందువలన పరదేశులు మొదట జప్నత్పనేహు యొద్ద ఆమోదం పొందిన తర్వాతనే ధాన్యం కొనుగోలు చేయవలసివుంది అని పరదేశు లకు కట్టడ నియమించడమైంది. ఇరవై సంవత్సరాలుగా తన తండ్రి విషయమై వర్తమానం కొరకు దేవుని మీద నిరీక్షణ కలిగియున్న యోసేపు, తన నిరీక్షణ ఫలితంగా తన అన్నలు ధాన్యం కొనుటకు ఐగుప్తుకు వస్తారని విశ్వసించాడు. ఎప్పటివలె ఆ రోజు కూడా జప్నత్ప విదేశీయుల కొరకు ధాన్యం మంజూరు చేయుటకు తన అధికార కార్యా లయంలో ఆసీనుడయ్యాడు. ఒక దేశం వారి తర్వాత మరి యొక దేశం వారు ప్రవేశిస్తున్నారు. లోనికి వచ్చిన వారందరు, 'జప్నత్పనేహు ప్రభువు' యెదుట సాష్టాంగ నమస్కారం చేస్తున్నారు. ఆ రోజు తన ఎదుటగా సాష్టాంగ నమస్కారము చేసినవారు పదిమంది. వారి తలల మీద పాగాలు చూస్తే, వారు హెబ్రీయులు! జప్నత్ప ఆశ్చర్య పోయాడు. వీరు హెబ్రీయులు. వీరు తన జాతివారు. "ఔను నిజమే! అందరికి ముందున్నవాడు.. రూ... బేనన్నా? ఔను, రూబేనన్నే, తర్వాత షిమ్యోనన్నా, లేవన్నా, యూదా అన్న ... తన సహోదరులు!" గబుక్కున లేచి నిల్చున్నాడు. వెళ్ళి తన అన్నలను గట్టిగా కౌగిలించుకోవాలనుకున్నాడు. వెంటనే కూర్చున్నాడు. ఇప్పుడు తన సహోదరులు నిలుచుని లేరు. పొలంలో పరుండబెట్టిన పనలవలె ఉన్నారు. వారు వారి వరుస ప్రకారం ముఖాలు నేల మోపి వందనం చేసారు. తర్వాత లేచి నిలబడినప్పుడు పది నక్షత్రములవలె కన్పిం చారు. ఇప్పటికి ఇరవై రెండు సంవత్సరాల క్రితం హెబ్రోనులో తనకు వచ్చిన కలలు గుర్తుకు వచ్చాయి. ఆ కలల వలననే తను ఈ అన్నలకు దూరమయ్యాడు. ఇప్పుడు తను వారికి బయలుపడితే, వారికి ఆ కలల గుర్తుకు వచ్చి భయపడతారేమో అనుకున్నాడు.

తన ప్రక్కనే నిలుచుని ఉన్న అక్షాపు వైపు చూశాడు. జప్నత్పలోని ఈ కలవరం అక్షాపు గమనించాడు. ఆయనలో ఇంత కలవరం అక్షాపు ఎన్నడు చూడలేదు. జప్నత్ప కనుసైగతో అక్షాపు కొంచెం క్రిందకు వంగి ఆయన ఐగుప్తు భాషలో చెప్పిన మాటలు "మీరు ఎక్కడ నుండి వచ్చితిరి"? అని అడిగాడు.

"ఆహారం కొనుటకు కనాను నుండి వచ్చితిమి" అని వంగి నమస్కారం చేసాడు యూదా.

మరలా జప్నత్ప ఐగుప్తుభాషలో అక్షాపుతో మాట్లాడితే, అక్షాపు హిబ్రూ భాషలో "మీరు వేగులవారు. ఈ దేశపు గుట్టు తెలుసుకొన వచ్చితిరి" అని కొంచెం కఠినంగానే అన్నాడు అక్షాపు.

మరలా యూదా జప్నత్ప వైపు చూచి నమస్కరించి, "లేదు ప్రభువా! నీ దాసులమైన మేము ఆహారము కొనుటకే వచ్చాము" తర్వాత మిగిలిన వారివైపు చూపిస్తూ "మేమం దరం ఒక్క మనుష్యుని కుమారులము. మేము యథార్థవంతు లమే గాని, నీ దాసులమైన మేము వేగులవారము కాము" అన్నాడు.

ఈ మాటలను అక్షాపు ఐగుప్తు భాష తర్జుమాలో జప్నత్పకు వివరించాడు.

అయితే జప్నత్ప తల ఆడిస్తూ "లేదు, ఈ దేశము గుట్టు తెలుసుకొనుటకై వచ్చితిరి" అని అన్నాడు.

అందుకు లేవి "నీ దాసులమైన మేము పన్నెండుమంది సహోదరులము. కనాను దేశములోనున్న ఒక్క మనుష్యుని కుమారులము. ఇదిగో కనిష్ఠుడు నేడు మా తండ్రి యొద్ద ఉన్నాడు. ఒకడు లేడు" అని చెప్పాడు.

అక్షాపు మరలా ఐగుప్తు భాషలో జప్నత్పనేహుకి చెప్పాడు. అందుకు జప్నత్ప "మీరు వేగులవారని నేను చెప్పిన మాట నిజమే. దీని వలన మీ నిజం తెలియబడును" అని తన ఆసనం మీద నుండి లేచి అటూ, ఇటూ తిరుగుతూ, "ఫరో జీవముతోడు, మీ తమ్ముడు ఇక్కడకు వచ్చితేనే గాని, మీరిక్కడి నుండి వెళ్ళకూడదు. మీ తమ్ముని తీసుకొని వచ్చుటకు మీలో ఒకని పంపుడి" అక్షాపు వైపు చూస్తూ, వారిని బంధించమని కోపంగా చెప్తూ, హెబ్రీయుల వైపు చూస్తూ "అయితే మీరు బంధింపబడియుందురు. అట్లు మీలో సత్యమున్నదో లేదో మీ మాటలు శోధింపబడును" అని వెళ్ళిపోతూ ద్వారబంధం వద్ద ఆగి "లేని యెడల ఫరో జీవముతోడు, మీరు వేగులవారే" అని వెళ్ళిపోయాడు.

తరువాత రెండు రోజులవరకు జప్నత్పనేహు తన కార్యాలయమునకు వెళ్ళలేదు. అక్షాపునకు కూడా ఏ విషయం తెలుపలేదు. ఇన్ని సంవత్సరాలలో జప్నత్ప అక్షాపు యొద్ద కావాలని దాచియుంచిన మర్మము ఈ హెబ్రీయుల విషయమే. అక్షాపుకు ఈ విషయం ఏమి అవమానకరంగా లేదు, కాని జప్నత్ప బహు దుఃఖములో ఉన్నాడని మాత్రం తెలుస్తుంది. తనకు తానుగా జప్నత్ప కబురు చేయవచ్చునని ఎదురు చూస్తూ ఉన్నాడు. జప్నత్ప అధికార మందిరంలో కూడా లేడని, వియాన్‌తో కలసి గోషెను ప్రాంతంలో విడిది చేసిన ఇష్మాయేలీయుల వద్దకు వెళ్ళాడని మాత్రం తెలిసింది. ఆయన అందుబాటులో లేనప్పుడు అన్ని బాధ్యతలు, అక్షాపు నిర్వహించవలసి ఉన్నందున, ఈ రెండు రోజులు అక్షాపు ఏ విషయం ఆలోచించడానికి తీరిక లేకపోయింది.

కార్యాలయం నుండి బయటకు వచ్చినప్పుడు అంగ రక్షకులు తనని అనుసరిస్తుంటే, వారికి రెండు రోజులు సెలవు ప్రకటించాడు. అంటే రెండు రోజుల వరకు వారు జప్నత్పనేహును సమీపించకూడదు. సాల వద్దనుండి గుర్రం వచ్చింది. జప్నత్ప గుర్రం మీద ఒక్క అంగతో కూర్చున్నాడు. అతివేగంగా, ఒంటరిగా వెళ్ళిపోయాడు. ఈ తొమ్మిది సంవత్సరాలలో మొదటిగా జప్నత్ప ఒంటరిగా గుర్రం స్వారీచేసాడు. చూసే వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు.

వియాన్ ఇంటి ముందు ఆగిన గుర్రం మీద నుండి దిగిన జప్నత్పని చూసిన వారెవ్వరూ ఆయన జప్నత్ప అనుకోలేదు. వియాన్ జప్నత్పను చూసి అదిరిపడ్డాడు. "అదేమిటి?" అంటూ వచ్చాడు. కానీ జప్నత్ప ముఖం చూసి మరీ భయపడ్డాడు. వెంటనే దగ్గరగా వచ్చి ఆజ్ఞ అన్నట్లుగా నిలబడ్డాడు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్



# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

ఇష్బోషెతు ఇంట్లోకి వచ్చిపోయే వారిని గమనిస్తూ గోధుమలు బస్తాలలో పోయిస్తు న్నారు. ఒక జాము గడిచింది. రేకాబు, బయానాలు ఇష్బోషెతు ఇంట్లోకి వెళ్ళటం దూరంగా గుఱ్ఱానికి జీను అమర్చుతూ చూసాడు సిబ్రూ.

ఇందాక రాజాగారి గదిలోనికి వెళ్ళిన సేవకులిద్దరూ బయటకు రావటం చూసి వాళ్ళను పిలిచాడు. వారు దగ్గరకు వచ్చినప్పుడు "రాజుగారు ఏమి చేస్తున్నారు" అని అడిగాడు.

"నిద్రపోవటానికి శీతల గదిలోనికి వెళ్ళారు" అని అన్నారు.

"రేకాబు సోదరులు మీకు ఎదురు వచ్చారు కదా!" అన్నాడు.

గోధుమలు తేవటానికి అని చెప్పి వెళ్ళిపోయారు.

సిబ్రూ గుఱ్ఱం ఎక్కి పడమరగా హెబ్రోను వైపు ప్రయాణం మొదలెట్టాడు.

అబీషై తన అరణ్య జీవితమంతా తనని ప్రేమించి తనను వెంబడించి తన హృదయంలో నిలిచిపోతే, అబ్నేరు సౌలును ప్రేమించి తన ప్రాణం తీయజూస్తే అతని భయం ఎల్లప్పుడు తన హృదయంలో ఉండేది. అతను సౌలును నిజంగా ప్రేమించాడు. అటువంటివాడు తనని కూడా ప్రేమిస్తాడు. అతను నమ్మకస్తుడు, ఇకలేడు. దేవుడు న్యాయవంతుడు. ఆయన క్రియలు న్యాయమైనవి. సిక్లగులో తను ఇతరులకు జరిగించిన అన్యాయమునకు దేవుని న్యాయమైన తీర్పు అమాలేకీయుల ద్వారా తీర్చాడు.

రాత్రిబాగా ప్రొద్దుపోయిన తర్వాత సిబ్రూ ద్వారా ఇష్బోషెతు యొక్క వర్తమానము తనకు ఊరట కలిగించింది రక్తపాతము లేకుండా రెండు రాజ్యములు ఒకటి కాగలవు అనుకున్నాడు.

అబీగయీలు మేలుకొనే ఉంది. కాని దావీదు ఆలోచన లకు అడ్డురాలేదు. రాత్రయినా పగలైనా దావీదు ఇంట్లో వుంటే పనివాడితో దావీదు అవసరాలు తీర్చదు. తానే స్వయంగా అన్ని పనులు చేస్తుంది. మధ్య మధ్యలో రెండుసార్లు దావీదుకు మంచినీరు అందించినప్పుడు దావీదు ఆమెవైపు కృతజ్ఞతాపూర్వకంగా చూచాడు. ఆ చూపు ఒక్కటి చాలు తన జీవితానికి అనుకోనేది అబీగయీలు.

ఉదయం మామూలుగానే సభకు వచ్చాడు. రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత కూడా దావీదు దర్శనం దొరకటం, ఆయనతో ఇష్బోషెతు విషయమంతా మాట్లాడటం సిబ్రూకి ఎంతో సంతోషంగా ఉన్నది. ఇప్పుడు సెలవు తీసుకొని మహనయీము తిరిగి వెళ్ళాలని చూస్తున్నాడు.

దావీదు తన ఆసనం మీద కూర్చున్న కొద్దిసేపటికి భటుడు లోనికి వచ్చి దావీదుతో ఏదో చెప్పాడు. దావీదు అది విని సిబ్రూ వైపు చూచాడు. సిబ్రూకి అర్థం కాలేదు.

"రిమ్మోను కుమారులు వచ్చారు" అని సిబ్రూతో అన్నాడు.

"వారు నిన్న నీతో వచ్చారా ?" అన్నాడు.

సిబ్రూ లేచి నిలబడి "లేదు ప్రభూ, వారు ఇక్కడికి వచ్చే విషయం మా రాజుకు కూడా తెలిసియుండదు" అన్నాడు. దావీదు ఆలోచిస్తూ వారిని లోనికి పంపించ మన్నాడు.

సభ లోనికి వారు ప్రవేశించినప్పుడు వారిని అస్సలు గుర్తుపట్టలేనట్లుగా అలసి యున్నారు. రేకాబు చేతిలో గుడ్డతో చుట్టబడిన వస్తువేదోవున్నది.

వారిద్దరు దావీదు వైపు వస్తూ ఆయననే చూస్తున్నారు. కాని సిబ్రూ సభలో ఉన్నట్లు వారికి తెలియదు. వారు వచ్చి నమస్కారం చేసి, రేకాబు తన చేతిలోని వస్తువును కప్పి యున్న వస్త్రమును తొలగించినప్పుడు సభంతా కలకలంగా మారి కొంచెంసేపటికి నిశ్శబ్దమైపోయింది.

దావీదు సిబ్రూ వైపు చూచాడు. సిబ్రూ ఖిన్నుడై తలవంచుకొని యున్నాడు. వారిద్దరు సాష్టాంగ నమస్కారము చేసారు.

"చిత్తగించుము, నీ ప్రాణం తీయజూచిన సౌలు కుమారుడైన ఇష్బోషెతు తలను మేము తెచ్చియున్నాము" అని చుట్టూ చూసారు. ఎవరి ముఖంలోను ఎటువంటి స్పందన వారు చూడలేదు. దావీదు ముఖం జేవురించియున్నది. ఈసారి బయానా కొంచెం పెద్దగొంతుతో యాజకుని స్వరం లాగ "ఈ దినము యెహోవా నా యేలిన వాడవు రాజువగు నీ పక్షమున సౌలుకును అతని సంతతికి ప్రతీకారము చేసియున్నాడు" అని సంతోషంగా చెప్పాడు.

సభంతా నిశబ్దంగా యున్నది. దావీదు సిత్రూకి సైగచేసి నేలమీద గుడ్డపైనున్న ఇష్బోషెతు తలను తీసుకోమన్నాడు. సిత్రూని చూసి రేకాబు బయానా అవాక్కయి పోయారు. ముంచుకొస్తున్న అపాయం అర్థమైంది. సిత్రూ మౌనంగా ముందుకు నడచి వస్తున్నప్పుడు అతని చెక్కిళ్ళ మీద నీటిధారలు అందరూ చూచారు. వణకుతున్న చేతులతో ఇష్బోషెతు తలను రెండు చేతులతో పైకెత్తి వస్త్రము మీద కప్పాడు.

"మంచి వర్తమానం" అని లేచి నిలుచుని "తెచ్చితినని తలంచి యొకడు వచ్చి సౌలు చచ్చెనని నాకు తెలియజెప్పగా, వాడు తెచ్చిన వర్తమానమునకు బహుమానంగా సిక్లగులో నేను వానిని పట్టుకొని చంపించితిని" అని సిత్రూ వైపు చూసి దగ్గరకు రమ్మన్నాడు. సిత్రూ ఇష్బోషెతు తలను తన ఆసనం మీద పెట్టి వస్తుండగా "కావున దుర్మార్గులైన మీరు" అని కోపంగా "ఇష్బోషెతు ఇంటిలో చొరబడి అతని మంచం మీదనే నిర్దోషియగు వానిని చంపినప్పుడు మీ చేత అతని ప్రాణదోషము విచారింపక పోదునా? లోకంలో ఉండకుండా నేను మిమ్ములను తీసివేయక మానుదునా?" అని ఆగి "సకలమైన ఉపద్రవములలో నుండి నన్ను రక్షించిన యెహోవా జీవముతోడు, మానను" అని సిత్రూకి సైగ చేశాడు.

సిత్రూ తన కత్తి ఒరనుండి లాగి వారిద్దరిని వెంట తీసుకొని వెళ్తుంటే నలుగురు సైనికులు సిత్రూని వెంబడించారు. మధ్యాహ్నమునకు వారి శవములు కాళ్ళు, చేతులు లేకుండా హెబ్రోను కొలను దగ్గర వ్రేలాడతున్నాయి. ఇష్బోషెతు తలను సిత్రూ తీసుకొని వెళ్ళి అబ్నేరు సమాధిలో వుంచి దావీదు యొద్దకు వెళ్ళాడు. దావీదు సిత్రూని పిలిచి అబీగయీలు ఇంటి వద్ద దానియేలునకు తోడుగా ఉండమన్నాడు. తన ప్రమేయం ఏ మాత్రం లేకుండానే అబ్నేరు, ఇష్బోషెతు చనిపోవటం దావీదు మనసు పరిపరివిధాల ఆలోచిస్తున్నది. వారిద్దరి మరణం తన మనస్సులో యధార్ధమైన దుఃఖాన్ని కలుగజేసినా మనుష్యులు పరిపరి విధాలుగా ఆలోచించి చేసే వ్యాఖ్యలు అన్ని తెలుస్తూనే వున్నాయి. అవి విన్నప్పుడు మనసు వికలమైపోయినా దేవుడు చూస్తున్నాడు అనే ధైర్యం. ఇదంతా దేవుని ఏర్పాటు అనే నమ్మకం. తదుపరి ఇశ్రాయేలీయుల విషయంలో దేవుని చిత్తం. తన తమ్ముడు చనిపోయాడన్న దుఃఖంలో ఉన్న మీకాలును ఓదార్చటానికి ఆమె మందిరానికి వెళ్ళాడు. సిత్రూ కూడా వున్నాడు.

మీకాలు కొంచెం ఒళ్ళు చేసింది. పూర్వంనాటి చలాకీతనం లేదు. ఆ ఉరవడి లేదు. వాన కురిసిన తర్వాత తడచిన నేలవలె మెత్తగా కూర్చుని ఉంది. తన వైపు చూచినప్పుడు హృదయంలో ఏదో వ్యధ. అబ్నేరు ఆమెను తీసుకొని వచ్చినప్పుడు ఆమె ముఖం కూడా ఎత్తి తనను చూడలేదు. కాని ఇప్పుడు తన చిన్నాయన అబ్నేరు, తమ్ముడు ఇష్బోషెతుల మరణం ఆమెను కృంగదీశాయి. దగ్గరగా వెళ్ళి ఆమెను ఓదార్చాలనుకున్నాడు. ఆమెకు ఇష్టం ఉండదు. అంతేకాక ఆమెను తాకటానికి మనస్సు రాలేదు.

పనికత్తె ఒక ఆసనం తీసుకొచ్చింది. దావీదు కూర్చున్నాడు. చాలాసేపు ఆమెను చూస్తూ ఉండిపోయాడు. ఇలా ఆమెను చూసి ఎన్నాళ్ళయింది. అప్పుడు ఆమెను ఇలా చూడాలని ఎన్నిసార్లు అనుకోలేదు. తను ఇక్కడికి ఎందుకు వచ్చానా? అని అనుకున్నాడు. అంతలో పనికత్తె పానీయం తీసికొని వస్తుంటే మీకాలు ఎదురుపోయి తానే తీసుకొని వచ్చి దావీదు ఎదురుగా నిల్చున్నది. దావీదు తలఎత్తి చూసాడు. కాని ఇప్పుడు ఆ కళ్ళ లోతు ఎంత? లోతు చూసే కొలది దాని పొడవు ఎక్కువౌతున్నది. పనికత్తె, సిత్రూ అక్కడ ఉన్నారన్న విషయమే మరచిపోయాడు. ఉన్నట్లుండి ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

**(సశేషం)**



# 'స్టుపిడ్, రాస్కెల్'



ఇంట్లో పిల్లలని తల్లిదండ్రులు 'స్టుపిడ్, రాస్కెల్' అని తిడుతుంటారు. మనిషికి వచ్చే కోపాన్నిబట్టి తిట్ల తీవ్రత వుంటుంది. తప్పులు చేసేవాళ్ళు తిట్లు తినాల్సి వస్తుంది. నాగరికత ఉన్నవారైతే సుతిమెత్తనగా తిడతారు, మోటు వాళ్ళు అయితే బండబూతులు తిడతారు. తిట్టు అనేది మనిషి యొక్క కోపాన్ని తెలియజేస్తుంది. బాగా కోపంగా ఉన్న వాళ్ళ ఎదుటికి వెళ్ళాలంటే భయపడతారు. కొంత మంది చాలా సున్నితమైన మనస్తత్వం కలిగినవారు అయితే చిన్న మాట అంటే చాలు ఏదో అఘాయిత్యం చేసుకుంటారు. కఠిన హృదయులు అయితే ఎంత తిట్టినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు తిట్టేది మమ్మల్ని కాదులే అన్నట్లు ఉంటారు. మనమంతా ఇలా చాలా కఠినమైన హృదయం కలిగిన వారమని దేవునితో తిట్లు తినడం ద్వారా రుజువు చేస్తున్నాము. దేవుడు తిట్టడం ఏంటని అనుకుంటున్నారా? 'పాపిష్ఠి జనమా, దోషభరితమైన ప్రజలారా, దుష్ట సంతానమా, చెరుపు చేయు పిల్లలారా మీకు శ్రమ' (యెషయా 1:4) ఇలా బుద్ధిహీనులారా, అవివేకులారా, తెలివిలేనివారలారా అంటే 'స్టుపిడ్' అని, దుష్టులారా, దుర్మార్గులారా అంటే 'రాస్కెల్' అని, ఇంకా పాపిష్ఠి జనమా, దుష్ట సంతానమా, సర్ప సంతానమా అని చాలాసార్లు మనుష్యులను తిట్టడం మనం బైబిల్లో చూడగలము. ఇలా ఎంత తిట్టినా, ఎన్నిసార్లు తిట్టినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు విదిలించుకొనిపోతుంటే మనమెంత కఠిన హృదయులమో కదా! దేవుడు తలుచుకుంటే ఒక్క క్షణంలో మనుష్యులని నాశనం చేయగల శక్తి ఉండి కూడా తిట్లతోనే సరిపెడుతున్నాడు. ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించి పాలు తేనెలు ప్రవహించు దేశమైన కనానుకు తీసుకెళ్ళేటప్పుడు అరణ్యంలో ఇశ్రాయేలీయులు దేవున్ని ఎంత విసికించారో, ఎంత క్షోభ పెట్టారో 'మీరు లోబడనొల్లని ప్రజలు; ఒక క్షణమాత్రము నేను మీ నడుమకు వచ్చితినా, మిమ్మును నిర్మూలము చేసెదను' (నిర్గమ. 33:5) అని అనేటంత కోపం పుట్టించారంటే వాళ్ళెంత కఠిన హృదయులో, దుర్మార్గులో కదా! దేవుడు మనుష్యులను చాలా ప్రేమిస్తాడు, ఆయన దయామయుడు, నిరంతరం జాలిపడే వారు, కరుణా హృదయముగల ఆయనకి 'మిమ్మల్ని చంపేస్తాను' అన్నంత కోపం పుట్టించే కఠినులని 'స్టుపిడ్, రాస్కెల్' అంటే వాళ్ళు మాట వింటారా. అందుకే ఐగుప్తులో నుండి బయలుదేరిన వారిలో యెహోషువ, కాలేబు తప్ప మిగతా వాళ్ళంతా అరణ్యంలోనే చచ్చారు. మనమేం తక్కువ తినలేదులేండి, ఇశ్రాయేలీయుల కంటే ఎక్కువగానే దేవునికి కోపం తెప్పిస్తూనే ఉన్నాము. అప్పుడు దేవుడు ఇశ్రాయేలీయులను చంపకుండా మోషే అడ్డుపడ్డాడు. ఇప్పుడు దేవుడు మనల్ని చంపకుండా 'ఈ ఒక్కసారికి క్షమించయ్యా, వాళ్ళు మారడానికి ఇంకొంతమందిని పంపించి వాక్యము చెప్పిస్తాను' అని యేసుప్రభువు అడ్డుపడబట్టే మనం బ్రతికి బట్టకడుతున్నాము. ప్రతిరోజూ ఎంతో మంది ప్రమాదాల్లో, హత్యలు, ఆత్మహత్య లతో, రోగాలతో చనిపోతున్నారు. ఇంకా మనం బ్రతికి ఉన్నామంటే అందుకు కారణం దేవున్ని ఎరుగని వారు దేవున్ని తెలుసుకోవాలని, దేవున్ని తెలుసుకున్నవారు సువార్త ప్రకటించాలని. అలా కానప్పుడు మనల్ని ఈ భూమి మీద ఉంచాల్సిన అవసరం దేవునికి ఏమీ లేదు. ఇశ్రాయేలీయుల్లా మనం కూడా దేవునికి కోపం పుట్టించి 'స్టుపిడ్, రాస్కెల్' అని తిట్టించుకుంటుంటే వారు కనాను దేశంలో ప్రవేశించనట్లే మనకి కూడా 'పరలోకరాజ్య' ప్రవేశం ఉండదు. ఇంక మీ ఇష్టం.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# గొప్పగా ఉండాలని కోరుకోకు

**"మీరు మనుష్యుల యెదుట నీతిమంతులని అనిపించు కొనువారు గాని దేవుడు మీ హృదయములను ఎరుగును. మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము" (లూకా 16:15).**

గొప్పగా జీవించాలని కోరుకోని వారు చాలా అరుదుగా కనబడతారు. కటిక దరిద్రంలో ఉన్నవారైనా సరే గొప్పవార మవ్వాలన్న ఆశ కలిగి ఉంటారు. మన చుట్టూ నివసించే వారి కంటే మనం తక్కువగా కనబడటానికి ఇష్టపడము. సాధ్యమైనంత వరకు గొప్పవాళ్ళతో పోటీ పడాలని తాపత్రయ పడతాము. మన గొప్పతనమన్నది మనుష్యుల ముందే కాని, దేవుని ముందు మనకంటూ గొప్పతనము ఉండదు. ఒకప్పుడు బాగా గొప్పగా బ్రతికిన వాళ్ళు దరిద్రమైన స్థితిలోనికి వెళ్తుంటారు. ఈ లోకంలో గొప్పతనమన్నది శాశ్వతమైనది కాదు. గొప్పతనం రావటానికి దేవుడు తనకిచ్చిన ఆధిక్యతలను మనిషి ఉపయోగించుకుంటాడు. ఉదాహరణకు ఒక మనిషి శారీరకంగా, మానసికంగా పరిపూర్ణుడుగా ఉన్నప్పుడు తను గొప్పగా ఉండాలని కోరుకుంటాడు. అదే, శారీరకంగా లేదా మానసికంగా వైకల్యం ఉన్నప్పుడు గొప్పతనాన్ని కోరుకోడు. నిర్గమకాండం 4:11 చూచినట్లయితే అంగవైకల్యం కలవారిని అనగా మూగ, చెవిటి, కుంటి, గుడ్డి వారిని పుట్టించింది దేవుడే అని వ్రాయబడి ఉంది. మనం అలాంటి స్థితిలోలేమంటే మనల్ని పరిపూర్ణంగా పుట్టించింది దేవుడే కదా! మరి దేవుడు మనకు ఇచ్చిన ఈ పరిపూర్ణతను ఆధారం చేసుకొని మనుష్యుల ముందు గొప్పగా, ఘనంగా కనబడాలనుకుంటే దేవుడు మనల్ని అసహ్యించుకుంటాడు. దేవుడు మనలను ప్రేమిస్తున్నాడంటే అది మన నీతికార్యాలనుబట్టో, మన గొప్ప తనాన్నిబట్టో కాదు గాని, అందుకు కారణం కేవలం దేవుని కృప మాత్రమే. *"జ్ఞాని తన జ్ఞానమునుబట్టియు, శూరుడు తన శౌర్యమునుబట్టియు అతిశయింపకూడదు, ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమును బట్టి అతిశయింపకూడదు. అతిశయించు వాడు దేనినిబట్టి అతిశయింపవలెననగా, భూమి మీద కృప చూపుచు నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలుసుకొనుటను బట్టియే అతిశయింపవలెను" (యిర్మీయా 9:23,24).* ఈ భూమి మీద ఎవరైనా తమకు గొప్పతనం ఆపాదించుకుంటు న్నారంటే అది తమకున్న జ్ఞానాన్ని బట్టో, ధనమునుబట్టో, బలమునుబట్టో గొప్పతనం ఆపాదించుకోవడం పరిపాటి. అలాంటి వారిని దేవుడు అసహ్యించుకుంటాడు. ఈ సృష్టిలో దేవునికంటే గొప్ప ఇంకేమి లేదు. అలాంటి దేవుని కంటే చెత్తవంటి మనిషికి విలువ ఇచ్చి వాళ్ళ మెప్పు కోరుకోవడ మంటే దేవున్ని అవమానించినట్లే. మనకంటూ ఏదైనా గొప్పతనాన్ని ఆపాదించుకోవాలంటే అది దేవుని విషయంలోనే సంపాదించుకోవాలి. దేవుని గురించి తెలుసుకొనుటనుబట్టి మనం గర్వించాలి. అప్పుడే దేవుడు మన వలన ఆనందిస్తాడు. దేవుడిచ్చిన ఆరోగ్యము వలన జ్ఞానము, బలము, ఐశ్వర్యము సంపాదించుకొని ఆయననే లెక్క చెయ్యకుండా మనుష్యుల ముందు గొప్పగా కనబడాలనుకుంటున్నా కూడా భూమి మీద కృప చూపిస్తున్న దేవుడు మనల్ని శిక్షించకుండా క్షమిస్తున్నాడు. కాబట్టి ఈ లోకంలో మనుష్యుల ముందు గొప్పగా ఉండాలని కోరుకోనకుండా, దేవుని ముందు గొప్పగా జీవించాలని కోరుకుందాము.

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# సృష్టికర్త

దేవుడు మానవుని కొరకు చేసిన సృష్టిలో భాగంగా వెలుగు తరువాత సృష్టించింది ఆకాశం. (ఆది 1:8)

మన కంటికి కనిపించే ఆకాశము ఎంత పెద్దదో గ్రహించుట 21వ శతాబ్దపు అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి అంతుచిక్కటం లేదు.

ఆకాశములో మనకు కనిపించే చంద్రుడు సూర్యుడే కాక కొన్ని వేలకోట్ల నక్షత్రాలు, గ్రహాలు, రకరకాల వాయువులు, దుమ్ము ధూళి ఉన్నాయట.

కొన్ని వేలకోట్ల నక్షత్రాలు, గ్రహాలు గుంపులు గుంపులగా ఉంటాయి వాటినే పాలపుంత అని అంటారు. అటువంటి పాలపుంతలు మన విశ్వంలో దాదాపు 200 బిలియన్ నుండి 2 ట్రిలియన్ వరకు ఉండవచ్చు అని అంచనా.

మనం ఉంటున్న ఈ భూమి, మనం, మనం చూస్తున్న సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అన్నీ మిల్కీవే అనే పాలపుంతకు చెందినవి.

ఇప్పటివరకు శాస్త్రవేత్తలు కనుగొన్న ఆకాశపు అంచులలో ఒక చివర నుండి మరొక చివరకు చేరడానికి కాంతివేగం (3 $10^8$ మీ/ సె) తో ప్రయాణిస్తే దాదాపు 90 వేల బిలియన్ సంవత్సరాల సమయం పడుతుందట. అంటే సెకనుకు 3,00,000,000 మీటర్ల దూరాన్ని చేరే వేగంతో ప్రయాణిస్తే 90,000,000,000 సంవత్సరాల సమయం పడుతుంది. అది కూడా ప్రస్తుతం మానవ ఆధునాతన టెక్నాలజీతో కనుగొన్న ఆకాశాపు అంచులను చేరడానికి. ఇంకా మానవుని సాంకేతికతకు అందని ఆకాశం ఉందని, అది ఇప్పుడు కనుగొన్న దానికి దాదాపు 500 రెట్లు పెద్దదిగా ఉండవచ్చు అని శాస్త్రవేత్తల అంచనా.

ఆకాశపు పరిమాణమును అంచనా వేయటమే మానవుని మేథస్సుకు అందని విషయమైతే ఇక ఆ విశాలములో జరుగు వింతలు గూర్చి ఆలోచిస్తేనే దేవుని బాహుబలమేమిటో ఇట్టే అర్థమౌతుంది.

ఆకాశములో కనిపించే మేఘాల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? చూడటానికి తెల్లగా, ఆకర్షణీయంగా దూదిపింజల వలె కనిపించే మేఘాలు వాస్తవానికి 1.1 మిలియన్ టన్నుల బరువు కలిగి ఉంటాయట. అది దాదాపు 100 ఏనుగుల బరువుతో సమానము.

వాతావణంలో ఆవిరిగా మారిన నీటి బిందువులు కొంత ఎత్తుకు చేరిన తరువాత చల్లబడి చిన్న చిన్న నీటి కణాలుగాను, మంచ గడ్డలగాను మారి మనకు మేఘము వలె కనపడతాయి. మేఘములోని నీటి సాంద్రతను బట్టి అది రకరకాల ఆకారాలలో, రంగులలో కనిపిస్తుంది. మేఘాల ద్వారా సూర్యకాంతి భూమిని చేరడం వలన భూమి ఉష్ణోగ్రతలు నియంత్రించబడతాయి.

మేఘాలు, అందులో ఉండే నీరు, తద్వారా ఏర్పడే వర్షాలు, తుఫానులు, మేఘాలలోని నీటి సాంద్రతను బట్టి ఏర్పడే వడగండ్లు, వాటి పరిమాణాలు, ఉరుములు, మెరుపులు, అవి ఏర్పడినప్పుడు విడుదలయ్యే శక్తి... వంటి వాటి గురించి తెలుసుకొనుటకు ప్రయత్నిస్తే దేవుని అపరిమిత శక్తి సామర్థ్యాలతో పాటు మనం ఎంత అల్పులమో, దేవుని ముందు మన స్థాయి ఎంటో అవగత మౌతుంది.

***"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురము చేయుచున్నది"*** కీర్తనలు 19:1

ఆకాశమహాకాశములు పట్టజాలని దేవుని ముందు మనమెంత? ఆయన యెదుట మన ప్రవర్తన ఎలాగున్నది? పరిశీలించుకొని, సరిదిద్దుకొని నీ కోసం సమస్త సృష్టిని చేసిన సృష్టికర్తకు ఆమోదయోగ్యమైన ప్రవర్తన కలిగి ఆయన బిడ్డలుగా ఈ భూమి మీద జీవిద్దాం.

సాక్ష్యము

# నన్ను నడిపిస్తున్న దేవుడు

ప్రకాశంజిల్లా కొనకమిట్ట వాస్తవ్యుడైన మా తండ్రి లింగారెడ్డిగారు బ్రతుకుతెరువు కోసం విజయవాడ వెళ్ళి, అక్కడ పరిస్థితులు సానుకూలపడక, ఒంగోలు వచ్చి ఆర్.టి.సి. ముఠాలో చేరాడు. మా తల్లి రవణమ్మ కూడ కష్టజీవి. కష్టము తప్ప 'దైవభక్తి' లాంటి విషయాలు ఆలోచించేవారు కాదు. ఆడపిల్లల సంతానమైనందున మగపిల్లల కొరకు వెంకటేశ్వరస్వామికి మొక్కుకొని మగ పిల్లవాడు పుట్టిన తర్వాత 'శ్రీనివాసులు' అని పేరు పెట్టుకొని శనివారం ఒక్క పొద్దు పూజచేసేది మా అమ్మ. ఒంగోలు సుందరయ్య రోడ్డులో కొద్దిస్థలం ఉంటే అక్కడ చిన్న ఇల్లు వేసుకోవాలని రాళ్ళకోసం విజయవాడ వెళ్ళి రాళ్ళు తీసుకొని లారీలో వస్తుంటే యాక్సిడెంట్ అయింది. అందరిలో మా తండ్రి మాత్రం బ్రతికాడు. అయితే కష్టం చేసే శక్తిపోయింది. అందువలన మా అమ్మమ్మ గారింట్లో కొంతకాలం ఉన్నాము. తర్వాత ఒంగోలులో మా స్థలంలో ఒక రేకుల ఇల్లు కట్టించుకొన్నాము.

అప్పుడు నేను చాలా చిన్నదానను. మా అక్క, చెల్లెలు, తమ్ముడు చదువుకోవడానికి వెళ్తుంటే, నేను మాత్రం మా నాయనతో కూరగాయలు అమ్మటానికి బండి వెంబడి ఉండేదానను. చిన్నప్పటినుండి కష్టపడి తల్లిదండ్రులకు సహాయంచేయాలని ఉండేది.

1996 ఆగస్టు 17న డాకా రమణారెడ్డిగారితో నాకు వివాహం జరిగింది. నా పెనిమిటి చదువుకొనినవాడు, కాని ఉద్యోగం లేదు. నాకు పరిచయమున్న భారతి నర్సింగ్ హోమ్‌లో ఆయనకు పని కుదిరింది. ఓ.పి వ్రాస్తుండే వాడు. హాస్పటల్లో అన్ని పనులు చేస్తూ పని నేర్చుకున్నాడు. 1998 జూన్ 6న నా భర్తతో కలసి కావలి దగ్గర రుద్రకోట వెళ్ళాను. ఒక్కరోజు మాత్రం ఉండి, సెలవు లేనందున ఒంగోలు వచ్చేశాము. జూన్ 10వ తారీఖున మామిడి తోపుకు వెళ్ళాము. ఒక మామిడి చెట్టు ఎక్కాను. జారి క్రిందపడ్డాను. ఒళ్ళంత తిమ్మిరై పోయింది. నిలుచుండ లేకపోయాను. ఏడుస్తూ ఉన్నాను.

వ్యాన్‌లో తీసుకొని వచ్చారు. ఎక్స్‌రేలు తీసారు. ఆపరేషన్‌కై ఒంగోలు కృష్ణచైతన్య హస్పటల్‌కి తీసుకొని వచ్చారు. తర్వాత హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్‌కి తీసుకొని వెళితే 'వెన్నెముక విరిగిపోయింది, లాభం లేదన్నారు. తర్వాత మద్రాసు అపోలో ఆస్పత్రికి తీసుకొని వెళ్ళారు. వాళ్ళు పరీక్షచేసి ఆరురోజుల తర్వాత చెబుతా మన్నారు. ఎక్స్‌రేలు తీసి, ఆపరేషన్ చేసి, రాడ్లు వేసి ఆరునెలలు ఆగి ఏ సంగతి చెబుతామన్నారు.రెండు లక్షలు ఖర్చు. 21 రోజుల తర్వాత ఒంగోలు వచ్చాము.

నాకు నడుము నుండి క్రిందికి స్పర్శ లేకుండా పోయింది. నేను బ్రతికి ఉంటే నాకోసం మరొకరు బ్రతకాలి, కనుక చనిపోవాలనుకున్నాను. ఓపిక ఉన్నంత వరకు ఏడ్చాను. నా స్థితి చూసి మా నాయన ఏడుస్తూ ఉండేవాడు. అది మరీ హృదయ విదారకరమైనది. చచ్చి పోకుండా నన్ను ఎవరు?ఎందుకు ఆపారు? నాకొచ్చే ఆలోచనలకు ప్రశ్నలకు జవాబు నేనే చెప్పుకోవాలి. నాకు జవాబులు దొరకవు. అందుకే చచ్చి పోవాలని హృదయ పూర్వకముగా ఆకాంక్షించాను. చచ్చి పోవటానికి నాకెవరు సహాయం చేస్తారు? చనిపోయే మార్గాలకై అన్వేషించాను. బ్రతకటమే కష్టమని అనుకుంటే చని పోవటం అంతకు పదిరెట్లు కష్టము. తర్వాత ఒక ఆయుర్వేద డాక్టరు కొంతకాలం వైద్యము చేసి లాభం లేదన్నారు. కొంతకాలానికి మంచానికి అని వుండే నా శరీర అవయవాలకు పుండ్లు రావటం మొదలయింది.

మాకు తెలిసిన ఒక క్రైస్తవుడు యేసుప్రభువును నమ్ముకొంటే స్వస్థత కలుగుతుందని చెప్పాడు. మా నాయన, అమ్మ, నా భర్త, అందరు యేసుప్రభువును

నమ్ముకున్నారు. నా శరీరంలో మంచానికి తగిలిన ప్రతి అవయవము పుండ్లు కలిగి మానినవి. 1998 డిసెంబరు 31న మద్రాసు తీసుకొని వెళ్ళారు. నాకు నా శరీరంలో పెట్టిన రాడ్లు తీశారు. ఇక నేను ఈ జన్మలో నడువలేనని చెప్పారు. డాక్టర్లు చెప్పిన ఈ మాటలకు నా తల్లి, నా భర్త యేసుప్రభువును తమ హృదయములో నుండి పూర్తిగా తొలగించుకున్నారు. కాని గత 20 నెలల్లో యేసుప్రభువు నా హృదయంలో కలిగించిన కొన్న సంఘటనలు ఆయనను నేను హత్తు కొనేటట్లు చేశాయి. మొదట్లో నేను కూడ యేసయ్యను వదలుతానేమో!? అనుకున్నాను. అయినా చచ్చిపోవాలనే కోరిక నాలో ఉన్నది. ఎన్నోసార్లు కిరసనాయిలుతో, కత్తితో ఆత్మహత్యకు ప్రయత్నించాను. కాని ఏదో దివ్యశక్తి నన్ను వారిస్తుందని గ్రహించాను.

నా పెనిమిటి నా చెల్లెలిని వివాహమాడాలని నా కోరిక. వారి పెండ్లి 1999 ఏప్రిల్ 1న రామతీర్థంలో జరిగినది. అప్పటి నుండి నాకు మరణించాలన్న కోరిక లేకుండా పోయింది. నాకు బిడ్డలంటే ఇష్టం. నాచెల్లి నా కొరకు బిడ్డలనుకంటుందని నమ్మాను.

చీమకుర్తి వెంకటేశ్వర్లుగారనే విశ్వాసి నా యొద్దకు వచ్చారు. ఆయన నాకు ఆదరణకరమైన వాక్యము అందించనారంభించారు. ఆయన నా కోసం నిత్యం ప్రార్థిస్తూ, నా కొరకు బైబిలు పుస్తకాలను తెచ్చి ఇచ్చేవారు.

నాకు వచ్చిన అనారోగ్యము స్త్రీలను రెండు సం॥లు మాత్రమే బ్రతుకనిస్తుంది. కాని నేను మరణించలేదు – దేవునికి నా యెడల ఏదో ప్రణాళిక ఉందని అనుకు న్నాను. 2003 నవంబరులో నా శరీరంలో ఏర్పడిన పుండు లోపల ఎముకలోకి కూడా పోయింది. ప్రతిరోజు 104 జ్వరం, ఆ పుండు ఎముకలోకి వెళ్ళిపోయింది. బ్రతకను అని చెప్పారు. ఆపరేషన్‌కి 20 వేలు ఖర్చు అవుతుంది, అయినా నమ్మకం లేదన్నారు. కాని ఒక్క పైసా ఖర్చులేకుండా ఆపరేషన్ అయింది. ప్రభువు బ్రతికించాడు.

ఇప్పుడు నా చెల్లికి ఇద్దరు కుమార్తెలు. నా చెల్లెలు, భర్త నన్ను ఎంతో ఆదరించారు. అన్నిటికంటే ముఖ్యంగా నేను యేసుప్రభువును నా రక్షకునిగా హృదయపూర్వకంగా నమ్మాను. ఆయనే నా జీవితాన్ని నడిపిస్తున్నాడని. ఆయన చిత్తములో నన్ను ఈ లోకములో ఎందుకు ఉంచాడో అది నెరవేర్చబడాలని కోరుకుంటున్నాను.

బాప్తిస్మము తీసుకోవాలని ఆశ ఉన్నది. ప్రభువు చిత్తములో ఆయన నాకు బాప్తిస్మము ఎప్పుడు ఇస్తాడో ఎదురుచూస్తున్నాను. నా తండ్రి ఒక్కడే మా కుటుంబంలో యేసుప్రభువులో జీవిస్తున్నాడు. నా కుటుంబమంతా రక్షించబడాలని ప్రార్థిస్తున్నాను.

ఈ 9 సంవత్సరాలలో నా శరీరంలో ప్రభువు చేసిన అద్భుతమైన క్రియలు ఎన్నో! ఇక్కడ వ్రాయటానికి వీలు లేదు కాని, నేను లేచి నిలబడక పోయినా 50 మందికి అన్నం వండి పెట్టగలను. కుర్చీలో కూర్చుండబెడితే అంట్లు తోముతాను, గుడ్డలు ఉతుకుతాను. ఇంకా మనిషి జీవించడానికి అవసరమైన పనులన్ని చేస్తాను. యేసుప్రభువు శక్తిని నిత్యం నా బలహీనతలోనే అర్థం చేసుకున్నాను. ప్రభువు తన బిడ్డలనెందరినో నావద్దకు పంపిస్తున్నాడు. వారి ఆత్మీయత నాకెంతో ఆదరణ. నా కొరకు నిత్యం ప్రార్థన చేస్తున్న ప్రభువు బిడ్డలందరు నాకు తెలుసు. వారికొరకు నిత్యం నేను ప్రార్థించే భాగ్యం ప్రభువు నాకు కల్పించాడు. నేను లేచినడిస్తే ఇప్పుడు నేను ప్రభువుకు ఎంత సమీపముగా ఉన్నానో, అంత సమీపంగా ఆయనను హత్తుకొని ఉండగలనా? అని అనుకున్నాను. ఆయన నాకుండగా ఈ లోకంలో ఏదియు నాకక్కరలేదని అనిపిస్తుంది.

ఈ సాక్ష్యము చదివినవారు నావలెనే విశ్వాసం కలిగి వుండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను.

'అమ్మా! నువ్వు లేచి నడుస్తావు' అని ఒక పాస్టరుగారు అన్నారు. నేనన్నాను – 'ఇప్పుడు నన్ను నడిపిస్తుంది ఆ ప్రభువే కదా!" అని అన్నాను.

1

## ఇశ్రాయేలుకు (క్రైస్తవులకు)

# తెలివిలేదు, యోచింపరు

ఒక దేశాధ్యక్షుడికి అపరిమిత అధికారాలు ఉంటాయి. ఆయన క్రింద సర్వసైన్యము, పోలీస్ వ్యవస్థ ఉంటుంది. ఇతర దేశాలవారి వలన తమ దేశమునకు ముప్పు ఉంటే దానినుండి తప్పించుకోడానికి తన సైన్యమును ఉపయోగిస్తాడు. ఎంత దేశాధ్యక్షుడైనా, ఎన్ని అపరిమిత అధికారాలున్నా, తన కడుపున పుట్టిన బిడ్డల విషయంలో వారు తప్పు చేసినప్పుడు బాధ్యతగా శిక్షించాల్సి వస్తుంది. ఎందుకంటే అధ్యక్ష స్థానములో ఉన్నప్పుడు తారతమ్యాలు లేకుండా, పక్ష పాతము లేకుండా అందరినీ ఒకేలా శిక్షించాలి. ఒకవేళ ఆ దేశాధ్యక్షుడు నియంతలా వ్యవహరిస్తుంటే ప్రజలు తిరగబడి అతనిని ఆ పదవి నుండి తప్పిస్తారు. ఇదంతా ఈ భూమి మీద మనుష్యుల మధ్యలో జరిగే తతంగం.

అయితే ఈ సర్వసృష్టిని, అందున్న సమస్తమును చేసిన సైన్యములకు అధిపతియైన దేవునికి ఈ మనుష్యుల చట్టాలు వర్తిస్తాయా? మనుష్యులు ఎలా ఉండాలి? ఎలా వ్యవహరించాలి అని వారు వ్రాసుకున్న చట్టాల పరిధికి లోబడి ఉంటుంది. ఎవరైనా ఆ పరిధి దాటితే వారి చట్టాల ప్రకారం శిక్ష ఉంటుంది. దేవుడెలా ఉండాలి అని దేవునికి పరిధి నిర్ణయించగలడా మనిషి?


దేవుడు మనిషిని సృజించిన తర్వాత ఆ మనిషికి పూర్తి స్వేచ్ఛని ఇచ్చాడు. ఆ స్వేచ్ఛని పరీక్షించడానికి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు వేసి, తోటలోని ఏ చెట్టు ఫలమునైనా నిరభ్యంతరముగా తినవచ్చును గాని, తోటమధ్యలో ఉన్న మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము మాత్రం తిన కూడదని, తింటే చస్తావని చెప్పాడు. ఇప్పుడు బంతి మనిషి కోర్టులోకి వచ్చి పడింది. చెట్టు ఫలము తినాలా? వద్దా? అనేది పూర్తిగా మనిషి నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది. అయితే హవ్వ సాతాను ప్రలోభాలకు లొంగి పండు తిని చావుని కొని తెచ్చుకుంది. హవ్వ లేనిదే తనకు బ్రతుకు లేదని, చావైనా బ్రతుకైనా హవ్వతోనేనని భావించిన ఆదాము తను కూడా పండు తిన్నాడు. ఫలితంగా ఏదెను తోటనుండి బయటకు తరిమివేయబడ్డారు. అప్పటి నుండి మనుష్యులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. చెమటోడ్చి భూమిని దున్ని పంటలు పండించి, ఆ పంట తినాలి. ఇన్ని కష్టాలకు కారణం వారు దేవుని మాట వినకపోవడమే.

అప్పటి నుండి మనుష్యులు దేవుని ఆజ్ఞలను పాటించకుండా తమ ఆలోచనలకు అనుగుణంగా జీవిస్తూ దేవుని మీద తిరుగుబాటు చేస్తూనే ఉన్నారు. "*నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి, తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను*" (ఆది. 6:5,6). తిన్న యింటి వాసాలు లెక్కపెట్టినట్లు, తనను సృష్టించిన దేవుడినే బాధపడేలా చేశారు మనుష్యులు. అందుకే దేవుడు నీతిమంతుడైన నోవహు కుటుంబం ఎనిమిది మందిని, సమస్త జీవరాసుల లోని ఆడ,మగ రెండింటిని తప్ప భూమి మీద నున్న సమస్తమును నాశనం చేశాడు.

అయినప్పటికీ మనిషి తీరు మారలేదు. పాపానికి చావు లేదన్నట్లు "నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది" (ఆది. 8:21) అని దేవుడు చెప్పినట్టే మనుష్యులు పాపానికి బానిసలై దేవున్ని ఇంకా ఇంకా బాధపెడుతూనే ఉన్నారు. చివరికి దేవుడు తన బాధనంతా ప్రకృతితో చెప్పుకుంటున్నాడు. "ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవి యొగ్గుము. నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని వారు నామీద తిరుగబడియున్నారు. ఎద్దు తన కామందు నెరుగును గాడిద సొంతవాని దొడ్డి తెలిసికొనును ఇశ్రాయేలుకు తెలివిలేదు నా జనులు యోచింపరు" (యెషయా 1:2,3) అని బాధపడుతున్నాడు. **(సశేషం)**

# బైబిల్ ప్రాముఖ్యత

యూదులను గురించి యెహెజ్కేలు 36వ అధ్యాయంలో ఈ విధంగా ఉంది. "నేను అన్యజనులలో నుండి మిమ్మును తోడుకొని, ఆయా దేశములలో నుండి సమకూర్చి, మీ స్వదేశములలోనికి మిమ్మును రప్పించెదను... నేను మీ పితురులకిచ్చిన దేశములో మీరు నివసించెదరు, మీరు నా జనులై యుందురు. నేను మీ దేవుడనై యుందును.., మీ దోషముల వలన మీకు కలిగిన అపవిత్రతను తీసివేసి మీ పట్టణములలో మిమ్మును నివసింపచేయునాడు పాడైన స్థలములు మరల కట్టబడును. మార్గస్థుల దృష్టికి పాడుగాను, నిర్జనముగాను అగుపడిన భూమి సేద్యము చేయబడును. పాడైన భూమి ఏదెను వనమువలె ఆయెననియు జనులు చెప్పుదురు. అప్పుడు యెహోవానైన నేను పాడైపోయిన స్థలములను కట్టువాడననియు, పాడైపోయిన స్థలములలో చెట్లను నాటువాడననియు మీ చుట్టు శేషించిన అన్యజనులు తెలిసి కొందురు. యెహోవానైన నేను మాట యిచ్చియున్నాను. నేను దాని నెరవేర్తును" యెహెజ్కేలు 36:26-28,33-36. అందుకే యేసుక్రీస్తువారి ఆరోహణ సమయంలో తన శిష్యులు "ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరలా అనుగ్రహించెదవా? (అపొ. 1:6) అని అడిగారు.



మొదటి ప్రపంచయుద్ధములో ఇశ్రాయేలీయులు తిరిగి పాలస్తీనా దేశమునకు తిరిగి వచ్చుటకు మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో నాంధి పలికినది. ఆ దినములలో బ్రిటీష్ యుద్ధ కర్మాగారములో 'ఎసిటౌన్' అను రసాయన పదార్థం లేకపోవటం వలన యుద్ధములో బ్రిటీష్ వారికి కొంత కష్టము కలుగుచుండెను. ఆ సమయంలో డా॥ వీజ్మాన్ అను యూదు రసాయన శాస్త్రవేత్తను బ్రిటీష్ ఆఫీసర్స్ కలిసి ఆయనను సహాయము అర్థింపగా అందుకు తగిన విధంగా వారికి సహాయం చేశాడు. ఈలాంటి విజయమునకు సహాయపడిన డా॥ వీజ్మాన్‌ను తగిన విధంగా సత్కరించాలని బ్రిటీష్ అధికారులు తలంచుచుండగా ఆయన తనకై ఏదీ కోరుకొనక తన యూదు ప్రజలకు, అనేక సం॥లుగా పరరాజుల క్రింద అనేక బాధలు అనుభవించిన తన ప్రజలకు ఒక మంచి నిరీక్షణ దొరుకునట్లు చేయుమని వారిని అడిగాడు. అప్పటి ఆయన ప్రార్ధన నెరవేరి 1917 నవంబరు 2వ తేదిన బాల్ఫోర్ డిక్లరేషన్ చేయబడి 'పాలస్తీనా' యూదుల గృహంగా మార్చబడుటకు రూపించబడినది.

అవును, 400 సం॥ల పూర్వము తండ్రియైన అబ్రాహాముకు కలిగిన పిలుపు అసమానమైనది. మోషే నాయకత్వంలో, ఐగుప్తు రాజైన ఫరోబాని సత్వం నుండి ఇశ్రాయేలీయులను విడిపింపబడుట మరియొక అద్భుతం. ఇశ్రాయేలు ప్రవక్తలు దేవుని ప్రేరణ ద్వారా వ్రాయబడిన పరిశుద్ధ గ్రంథము ఒక అద్భుతం. ఈ దినములలో తిరిగి ఇశ్రాయేలీయులు వారి స్వదేశము చేరి రాజ్యమేర్పరచుకొనుట మరియొక అద్భుతం.

ఇన్ని అద్భుతాలతో, ఇన్ని నిజాలతో, ఇన్ని ఋజువులతో నిండివున్న ఈ పరిశుద్ధగ్రంథమునకు ముందు, పరిశుద్ధగ్రంథములో పరిశుద్ధ గ్రంథము కంటే అతీతుడు ఆ పరిశుద్ధ గ్రంథము యొక్క దేవుడే. ఈ పరిశుద్ధ గ్రంథమంతా చెప్పేది రక్షణను గురించే. ఇంకా చెప్పాలంటే ఈ గ్రంథము లోని సమాచారం అంతా రక్షణకర్త (తండ్రియైన దేవుడు), రక్షణ మార్గము (యేసుక్రీస్తు), రక్షణ వారసులను

(మానవులు) గురించే వ్రాయబడింది. మీరు గమనించే ఉంటారు, పాత నిబంధన వర్తమానం సీనాయి కొండ ప్రాముఖ్యత అయితే క్రొత్త నిబంధన కల్వరి కొండ ప్రాముఖ్యతను ప్రచురిస్తుంది. పాతనిబంధనలో ఐగుప్తు దాసత్వం నుండి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మోషే (కాగా రమ్ము నిన్ను ఫరో యొద్దకు పంపెదను ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులో నుండి తోడుకొని పోవలెను... నీవు ఈ ప్రజలను తోడుకొని వచ్చిన తర్వాత, మీరు ఈ పర్వతము మీద దేవుని సేవించెదరు. నిర్గమ.3:10) నూతన నిబంధనలో పాప దాస్యము నుండి ఇచ్చిన స్వాతంత్ర్య మును (గలతీ 5:1 ఈ స్వాతంత్ర్యం అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు) గురించి చదువుకుంటాం. ఇంకా గమనించారా! పాత నిబంధన 'దేవుని'తో ప్రారంభమైతే (ఆది 1:1 ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను) క్రొత్తనిబంధన క్రీస్తుతో ప్రారంభమవుతుంది (మత్తయి 1:1 అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసుక్రీస్తు వంశావళి). పాత నిబంధనలో ఏర్పరచబడిన వారిని గురించి, క్రొత్త నిబంధనలో ఏర్పరచబడిన సంఘమును గురించి. యుగములను, చరిత్రలను చేసిన ఆ దేవుడు యుగములకు ముందు, యుగముల తర్వాత ఉన్నవాడునై యున్నాడు (నిర్గమ 3:14 నేను ఉన్నవాడను అనువాడనై యున్నాను).

ఈ బైబిల్ వృత్తాంతమును క్రమముగా అర్థం చేసుకోవడానికి బైబిలులోని ముఖ్య ప్రదేశములను, కాలములను గురించి చదివినట్లయితే కొంత అవగాహన వస్తుంది. మచ్చుకు కొన్ని ఉదాహరణలను ఈ క్రింద గమనించగలము. పాతనిబంధన చరిత్ర, ఇంచుమించుగా ఏదెనుతోట అరారాతు పర్వత ప్రదేశం, బాబేలు, కల్దీయుల ప్రదేశమైన ఊరు, అబ్రాహాము దినములలోని కనాను, యోసేపు కాలంలోని ఐగుప్తు, సినాయి పర్వతం, ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణం, యెహోషువ కాలంలోని కానాను, ఇశ్రాయేలీయులను (ఉత్తర దేశము) చెరగొనిపోయిన అస్సీరియా, యూదులను (దక్షిణ దేశము) చెరగొనిపోయిన బబులోను, యూదులు చెర నుండి తిరిగి వచ్చిన కానాను ప్రాంతములు పాత నిబంధన చరిత్రను విపులంగా వివరిస్తాయి. అలాగే ముఖ్య కాలములను పరిశీలించిన పరిశుద్ధ గ్రంథములోని చరిత్ర సారాంశము అర్థమవుతుంది.

1. పితరుల కాలము: ఇందులో సృష్టి, మానవుని ఆధ్యాత్మిక పతనము, మహా ప్రళయం, జనులు చెదరిపోవుట, రాజ్యాల అవతరణ, బహు భాషల విస్తరణ, అబ్రాహాము పిలుపు, యాకోబు సంతతి ఐగుప్తుకు వలస వచ్చుట.

2. నాయకుల కాలము: ఐగుప్తులో మోషే నాయకత్వం మొదలు ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణం, పాలు తేనెలు ప్రవహించు కానాను ప్రవేశం, న్యాయాధిపతుల నాయకత్వం.

3. రాజుల కాలము : సౌలు మొట్టమొదటి రాజుగా అభిషేకించబడిన నాటనుండి వారు చెరలోనికి కొనిపోబడే వరకు ఉన్న కాలము. ఇందులో దావీదు కాలమునాటి ఐక్యరాజ్యము సొలొమోను తర్వాత ఇశ్రాయేలు, యూదాలుగా విభజింపబడిన ఉత్తరరాజ్యం, దక్షిణరాజ్యము ఆయా రాజులు రెండు దేశాలను పరిపాలించడం, వారి కాలములో ప్రవక్తల పరిచర్య.

4. పరరాజుల పరిపాలనా కాలం : అస్సీరీయులు ఇశ్రాయేలీయులను, యూదావారు బబులోను రాజ్యములకు చెరగొని పోబడినది మొదలు క్రీస్తు వరకు ఉన్న కాలము. ఇక్కడ మనకు ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు మరియు ప్రవక్తలైన దానియేలు, యెహెజ్కేలు కనిపిస్తారు.

5. యేసుక్రీస్తువారి కాలము : మొదటి నాలుగు సువార్తలలో విపులంగా వ్రాయబడింది.

6. సంఘకాలము : క్రీస్తు యేసే ముఖ్యమైన మూల రాయియై యుండగా యెరూషలేములో ప్రారంభమైన సంఘం, యూదయ, సమరయ దేశము లలోనేగాక భూదిగంతములలోను, అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాది మీద కట్టబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయముగా వృద్ధి పొందుచున్న ఈ కాలము. **(సశేషం)**

# మదర్ తెరీసా

10

లేఖనాల్ని గుర్తు చేసుకొని ప్రభువు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనుట వలన దేవుని నడిపింపు, ఆయన చిత్తము మనకు తెలుపబడుతుంది. అపొ.కార్య. 11:16లో పేతురుకు యేసుప్రభువు చెప్పిన మాట జ్ఞాపకం చేసుకొనెనని వ్రాయబడినది. మదర్ తెరీసా వద్ద చేరిన అమ్మాయిలు ఇద్దరిద్దరుగా వెళ్ళి పేదవారి సేవలో పని చేస్తుండేవారు. ఈ విధంగా ఇద్దరిద్దరుగా వెళ్ళుట వలన ఒకరికొకరు సహాయముగాను, భద్రతగాను ఉంటుందని ఒక తెలివైన పెద్దాయన గమనించి చెప్పినప్పుడు మదర్ తెరీసా ఖచ్చితంగా ఏమని జవాబు చెప్పారంటే, ఇద్దరేసి వెళ్ళుటలో వారి భద్రతకు సంబంధించినదేమీ కాదుగాని, ప్రభువైన యేసు లూకా 10వ అధ్యాయంలో తాను వెళ్ళబోవు ప్రతి ఊరికిని ప్రతి చోటికిని తనకంటె ముందు ఇద్దరిద్దరినిగా పంపినట్లు తెలియజేసింది. అంటే ప్రభువు చెప్పిన ఆజ్ఞను అమలు పరచుట ద్వారా వాళ్ళ నియమావళిలో ఒక భాగమైంది. యేసుప్రభువు శిష్యులులాగా యిద్దరిద్దరు కలసి హాస్పిటల్‌కి, కుష్టురోగుల దగ్గరికి వెళ్ళాలి.

1949లో భారతదేశము మామూలు స్థితికి చేరింది. అయినను నిర్భాగ్యులైన పేదరికం, వ్యాధిబాధలు మాత్రం ప్రబలంగానే వున్నాయి. క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన భారత దేశానికి తనవంతు ధైర్యాన్ని సమకూర్చాలని మదర్ తెరీసా భావించింది. గాంధీగారికి అతి ప్రియుడైన జవహర్ లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా భారతదేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఆమెకు భారతదేశ పౌరసత్వం ఇవ్వబడింది. ఒకరోజు మైఖేల్ గోమ్స్‌గారితో ట్రామ్‌లో హౌరాకు ప్రయాణం చేస్తుండగా కొందరు ఆమె గురించి బెంగాలిలో ఈ విధంగా అంటున్నారు. ఈ ఐరోపా తెల్ల మహిళ కలకత్తాకు వచ్చి ఎందరో భారతీయ హిందువుల్ని క్రైస్తవ మతంలోకి మారుస్తుంది. ఈ విదేశీయురాలు ఆ పనంతా డబ్బు కోసం చేయటంలేదని మరింత మందిని క్రైస్తవమతంలోకి మార్చేందుకు చేస్తున్నారని అంటున్నారు. వాళ్ళనుకునే మాటలన్నీ ఆవిడకు అర్థమవుతూనే వున్నాయని వారికి తెలియదు. మదర్ తెరీసా సెయింట్ మేరీస్‌లో బెంగాలీలోనే బోధించింది. చాలాసేపు ఆమె ఏమీ మాట్లాడకుండా వారు అంటున్నదంతా విన్నది. ఆఖరుకు వాళ్ళ వైపు తిరిగి “ఆమె భారతార్‌రీ భారత్ అమర్” అంది. నేనూ భారతీయురాల్ని, భారతదేశం నాది అని దానర్థం. వాళ్ళ నోట మాట రాలేదు. మైఖేల్ గోమ్స్ అది విని ఎంతో సంతోషించాడు.

మదర్ తెరీసా తన కార్యకలాపాల్ని ప్రారంభించిన కొన్ని నెలల్లోనే, 1950 సంవత్సరం మొదట్లో ఆర్చ్ బిషప్ పెరియార్ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆవిడ అడుగు వేసిన దారికి అనుకూలంగా వుందా నిర్ణయం. ఆయన ఏప్రిల్ నెలలో రోమ్ నగరం వెళుతున్నారు. ఆ లోపు మదర్ తెరీసా స్థాపించబోయే సంస్థ నియమావళి అయిదు కాపీలు తీసుకుని కార్డినల్ పెట్రస్ ఫమాస్ని బియోండికి యివ్వాలని ఆయన సంకల్పం. ఆ కార్డినల్ ఆఫీస్ ఫర్ ది ప్రాపగేషన్ ఆఫ్ ఫెయిత్ సంస్థకు అధిపతి. తుది గుర్తింపు ఇవ్వవలసింది ఆయనే. ఆర్చ్ బిషప్ ఆదేశానుసారం ఫాదర్ నాన్ ఎగ్జిమ్, మదర్ తెరీసా నియమావళి తయారు చెయ్యడం మొదలు పెట్టారు. 275 నియమాలతో తయారు చేశారు. “కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ది మిషనరీస్ ఆఫ్ ఛారిటీ” అందులో ముఖ్యమైంది. డార్జిలింగ్ ప్రయాణంలో మదర్ తెరీసాకు యేసుప్రభువు పిలిచిన పిలుపు. తను కాన్వెంట్ వదలిపెట్టాలి. పేదవాళ్ళలాగా బతకాలి, తన కార్యకలాపాలు వుండవలసింది మురికివాడల్లో. కలకత్తా వీధుల్లో దిక్కులేక వదిలేసిన పసిగుడ్డులు, పిల్లలు, కుష్ఠువ్యాధిగ్రస్తులూ, మరణ సన్నిధిలో వున్న అభాగ్యులువంటి వాళ్ళకోసమే. “పవిత్రత, పేదరికం, విధేయత” ఈ మూడింటినీ మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ నాలుగో ప్రమాణాన్ని మదర్ తెరీసా తీసుకున్నారు. “నిరుపేదలకు మనస్ఫూర్తిగా స్వచ్ఛంద సేవ” చెయ్యడం. దీనివల్ల మృత్యుముఖంలో వున్న వాళ్ళకి, నిరాదరణకు గురైన వారికి, సంఘ బహిష్కృతులకు, కుష్ఠువ్యాధిగ్రస్తులకు జీవితంలో

సకల విశ్వాసాన్ని, ఆశని పోగొట్టుకున్న వాళ్ళకి భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఆహారం, వస్త్రం, రక్షణ, సేవ కల్పించే కర్తవ్యం మిషనరీస్ మీద వుంటుంది.

1950 అక్టోబర్ 7న మదర్ తెరీసా స్థాపించిన క్రొత్త సమాజానికి పోపుగారి ఆమోదం లభించింది. గోమ్స్‌గారి భవనంలో ఆర్చ్ బిషప్ పెరియార్‌గారు స్వయంగా వచ్చి ఫాదర్ వాన్ఎగ్జెమ్, ఫాదర్ హెన్రీలతో కలసి దివ్యపూజ ప్రార్థన జరిపించారు. ఆ ప్రార్థనలో ఆ స్థాపనా శాసనాన్ని ఫాదర్ వాన్ఎగ్జెమ్ చదివి వినిపించారు. "మదర్ తెరీసా పర్యవేక్షణలో ఈ సమాజం ఏర్పడుతుంది. దయార్ద్ర హృదయంలో నిర్భాగ్యులను ఆదరించాలన్న దీక్ష హర్ష నీయం. అనాథలైన పిల్లల్ని, పెద్దల్ని ముసలివారిని, నిరాధా రులైన పేదలకు, రోగులకు, మరణించే వారికి నిరుపయోగు లకి త్రోసివేయబడిన వారికి సేవ చెయ్యాలన్న సత్సంకల్పం అభినందనీయం. కష్టనష్టాలను భరిస్తూ, శక్తి వంచన లేకుండా, వాడవాడలా తిరిగి గ్రామాలకు వెళ్ళి, ఎంతో ఓర్పుగా అవసరంలో వున్న వారికి అందించే సేవలను పరి శీలించిన పిదప, యేసుక్రీస్తు ప్రేమను లోకానికి వెల్లడించా లన్న ఏకైక లక్ష్యంతో మదర్ తెరీసా స్థాపించిన సమాజం చేస్తున్న అవిరళ కృషికి సంపూర్తిగా తెలుసుకున్న తర్వాత, ఈ సంఘానికి అధికార పూర్వకమైన గుర్తింపు నివ్వడం జరిగింది. ఇక నుంచి ఈ సమాజం మిషనరీస్ ఆఫ్ ఛారిటా అనే పేరున ఉదహరిస్తుంది. ఈ పత్రానికి ఆర్చ్ బిషప్‌గారు ఆమోద ముద్రవేసి మదర్ తెరీసాకు అందించారు. పదకొండుమంది సిస్టర్స్‌తో మదర్ క్రొత్త సమాజాన్ని స్థాపించింది.

ఆ తర్వాత రెండేళ్ళలో మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థలో ముప్పై మంది చేరారు. పై అంతస్తు మొత్తం నిండిపోయింది. అది చాలక మదర్ తెరీసా పైన మిద్దె మీద తాత్కాలిక ఏర్పాటుగా ఒక గది వేశారు. ఇంకా స్థలం సరి పోవడం లేదు. రెక్కలు విప్పుకుంటూ వున్న మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థపట్ల ఫాదర్ హెన్రీ, ఫాదర్ వాన్ ఎగ్జెమ్ ఎప్పుడూ ఆసక్తి చూపిస్తూనే ఉన్నారు. వాళ్ళు మళ్ళీ సైకిళ్లు వేసుకొని పెద్ద నివాసం కొరకు వెతకడం ప్రారంభించారు. సిస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చెయ్యడం మొదలు పెట్టారు. ఒకరోజున ఒకాయన క్రీక్‌లేన్‌కి వచ్చి అనుకూల మ్కెన భవనం ఒకటి అమ్మకానికి వుందని మదర్ తెరీసాతో చెప్పాడు. అది 54ఎ, లోయర్ సర్క్యులర్ రోడ్‌లో వుంది. మదర్ తెరీసాను వెళ్ళి చూడమన్నాడు. ఆ ఇంటి యజమాని పేరు డాక్టర్ ఇస్లామ్. ఆయనో మేజిస్ట్రేట్. మదర్ తెరీసా వెళ్ళి చూశారు. అంతా బాగానే వుంది కాని మదర్ దగ్గర చిల్లి గవ్వలేదు. ఆ భవనాన్ని కొనాలంటే సాధ్యమయ్యే విషయమేనా? పైగా అది కలకత్తా నగరం మధ్యభాగంలో బాగా రద్దీగా వుండే ప్రాముఖ్యమైన స్థలంలో వుంది. ఆమె ఆలోచనలో పడింది. అది దైవ సంకల్పమైతే ఆయనే డబ్బు విషయం చూసుకుంటాడనే సరిపెట్టుకుంది. డాక్టర్ ఇస్లాం సెయింట్ జేవియర్ కాలేజీలో చదువుకున్నాడు. విద్యా రంగంలో మిషనరీలు, ఫాదర్లు చేస్తున్న సేవ అతనికి బాగా తెలుసు. ఆ భవనం అన్నిటికీ అందుబాటులో వుంది. చక్కగా సరిపోతుంది. అందుచేత దాన్ని కొనడం గురించి ఎగ్జిమ్ ఆర్చ్ బిషప్స్‌తో మాట్లాడారు. అటువంటి భవనం పోతే మరలా దొరకటం కష్టమని దాని ఆవశ్యకతను ఆర్చ్ బిషప్‌గారు ఆ భవనాన్ని కొనడానికి లక్ష రూపాయలు వడ్డీ లేని అప్పుగా మంజూరు చేశారు. డాక్టర్ ఇస్లాం పాకిస్తాన్‌కు వలస వెళ్ళి పోతున్నా, తన భవనాన్ని అమ్మి విడిచి వెళ్ళడం ఎలా? అని ఆలోచిస్తున్నాడు. మదర్ తెరీసా చేస్తున్న సేవ గురించి తన మిత్రులనడిగి తెలుసుకున్నాడు. కాని వారు బేరం కుదిరినా లక్షరూపాయలకు ఆ భవనం వున్న స్థలం ఖరీదులో సగం కూడా కాదు. ఇస్లాం ఆ భవనం ముందు నిలబడి దానికేసి చూస్తూ చలించిపోయినట్లు కనబడ్డాడు. కొంచెంసేపు ఆగాక తన దగ్గర్లో మౌలాలి మసీదుకు వెళ్ళి ప్రార్థన చేసి వచ్చాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "దేవుడే నాకీ ఇల్లు ఇచ్చాడు. తిరిగి ఆయనకే ధార పోస్తున్నాను" అన్నాడు. లక్ష రూపాయలకు ఆ పెద్ద భవనాన్ని మదర్ తెరీసాకు అమ్మివేసి డాక్టరు ఇస్లాం వెళ్ళిపోయారు. కొంతకాలం గడిచాక మదర్ తెరీసా లక్ష రూపాయల అప్పును తీర్చివేసినారు.

**(సశేషం)**

9

# తల్లిదండ్రులారా!

హగ్గయి 1:5లో *"సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా, 'మీ ప్రవర్తనను గూర్చి ఆలోచించుకొనుడి"* అని మనుష్యులను హెచ్చరిస్తున్నాడు. మరి బిడ్డల ముందు మీ ప్రవర్తన ఎలా ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఇంట్లో మీ బిడ్డల ముందు మీరు మాట్లాడుకొనే మాటలు కానీ, మీ ప్రవర్తన కానీ ఎలా ఉంటుందో, అవి వారి మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయో ఆలోచించారా? మీరు ఇంట్లో బూతులు తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ఉంటే అవి మీ పిల్లల భవిష్యత్తు మీద ప్రభావం చూపించకుండా ఉంటాయా? మీరు దేవునియందు భయభక్తులు కలిగి ఉండకపోతే పిల్లలు పాడై పోతారని బైబిలు చెప్తుంది. *"అవిశ్వాసియైన భర్త భార్యనుబట్టి పరిశుద్ధపరచబడును; అవిశ్వాసురాలైన భార్య విశ్వాసియైన భర్తనుబట్టి పరిశుద్ధపరచబడును. లేనియెడల* ***'మీ పిల్లలు'*** *అపవిత్రులై యుందురు, ఇప్పుడైతే వారు పవిత్రులు". (1కొరింథీ. 7:14).* పిల్లలు చాలా సున్నిత మనస్కులు. కుటుంబంలో జరిగే ప్రతి విషయం వారి మీద ప్రభావం చూపిస్తుంది. తల్లిదండ్రుల ప్రవర్తన గురించి వారు ఆలోచిస్తారు. అందుకే భార్యాభర్తల మధ్య ఎన్ని మనఃస్పర్థలు ఉన్నా పిల్లల ముందు చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలి. పిల్లల ముందు అసభ్యంగా మాట్లాడుకొనే తల్లిదండ్రులు తమ ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలి. దేవుడు అదే చెప్తున్నాడు 'మీ ప్రవర్తన గురించి ఆలోచించుకొనుడి' అని. తల్లిదండ్రులు ఒకరికొరకు దూషించుకుంటున్నా, కొట్టుకుంటున్నా, పిల్లలు ఎవరిని సమర్థించాలో తెలీక సతమతమౌతుంటారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసి చాలా డబ్బు సంపాదించుకుంటారు, ఆస్తులు కూడబెట్టుకుంటారు, మంచి ఇల్లు కట్టించుకుంటారు, కార్లు కొనుక్కుంటారు, ఇంకా విలువైనవి ఎన్నో సమకూర్చు కుంటారు. కానీ, కుటుంబంలో సమాధానము, సంతోషము లేనప్పుడు, పిల్లలు అపవిత్రులైన తర్వాత కుటుంబంలో ఎవరూ నెమ్మదిగా ఉండలేరు. సమకూర్చుకున్నవి చూసుకోవడానికి తప్ప, దేనికి పనికిరావు. అన్యజనులకి, క్రైస్తవులకి తేడా లేని జీవితం జీవిస్తుండబట్టే దేవుడు **'మీ ప్రవర్తన'** విషయమై అడుగుతున్నాడు. భార్యాభర్తల మధ్య ఉండే అహం కుటుంబ విచ్ఛిన్నానికి కారణమవుతుంది. పిల్లలు పుట్టిన తర్వాత భార్యభర్తలు విడిపోతే, పిల్లలు తల్లి దగ్గరో, తండ్రి దగ్గరో ఉండాల్సి వస్తే, ఆ పరిస్థితి వారికి అవమానకరంగా ఉంటుంది. దేవుడు లేని కుటుంబాలలో ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంది. ఎందుకంటే, దేవుడు అన్న భావన కలిగి ఉన్నవారు తమ్మును తాము తగ్గించుకుంటారు. భార్య లేదా భర్త ఎవరో ఒకరు దేవునియందు భయభక్తులు కలిగినవారైతే కొంతవరకు సమాధాన పరిస్థితులు కల్పించుకుంటారు. భార్యాభర్తలు ఇద్దరూ దేవునియందు భయభక్తులు లేనివారైతే, వారి పిల్లల మీద ఆ ప్రభావం ఉంటుంది కాబట్టి వారు అపవిత్రులైపోతారు. డబ్బు, ఇల్లు, స్థలాలు, పొలాలు, బంగారం ఇవి కాదు ఆస్తి. నిజమైన ఆస్తి **'పిల్లలే'**. ఎన్ని కోట్ల ఆస్తి ఉన్నా, పిల్లలు దూరమైపోతే వృద్ధాప్యంలో మీరు సంపాదించుకున్నవేవీ మీకు ఉపయోగపడవు. అవి నిరర్థకమైపోతాయి. దేవుడు మీకు ఇచ్చిన ఆస్తి **'మీ బిడ్డలే'** కాబట్టి, దేవుడిచ్చిన ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ మీదనే ఉంది. బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచడం వలన మీ వృద్ధాప్యంలో మీరు సంతోషంగా ఉంటారు. కాబట్టి 'మీ ప్రవర్తన గురించి మీరు ఆలోచించుకొని' మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచండి. **ఇది దేవుని చిత్తమై యున్నది.**

*"వ్రాయబడిన ప్రకారము మిమ్మునుబట్టియేగదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది?" (రోమా 2:24).* ఈ వాక్యాన్ని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే 'దేవుని నామము అన్యజనుల మధ్య దూషింపబడటానికి' క్రైస్తవ తల్లిదండ్రులు కారణం కాదంటారా? క్రైస్తవులు ఎవరైనా సరే, దేవునికి వ్యతిరేకమైన కార్యములు చేస్తేనే కదా అన్యజనుల మధ్య దేవుని నామము దూషించబడేది.

అన్యజనులు యేసును దేవుడు అని అంగీకరించకపోయినా, ఆయన బోధలను ఇష్టపడతారు. 'ఒక చెంప మీద కొడితే ఇంకో చెంప చూపించండి' అని యేసు చెప్పిన మాటలను గాంధీజీ విరివిగా ప్రచారం చేశాడు. యేసుప్రభువు మా దేవుడు అని చెప్పుకొనే **'క్రైస్తవులు'** ఆయన బోధనల ప్రకారం జీవించకపోతే **'వీరేమి క్రైస్తవులు'** అని అన్యజనులు తూల నాడతారు. పిల్లలు క్రమమైన మార్గములో నడవకపోతే తల్లి దండ్రులను ఎలాగైతే తప్పు పడతారో, క్రైస్తవులు క్రమమైన మార్గములో నడవకపోతే, వారి దేవుడినే కదా తప్పు పడతారు. 'బాలుడు నడువవలసిన త్రోవను' తల్లిదండ్రులు నేర్పకపోతే వారు పెద్దవారైనప్పుడు అన్యజనుల మధ్య దేవుని నామము దూషింపబడటానికి కారణం అవుతారు. తల్లి దండ్రులు తమ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచినట్లయితే షద్రకు, మేషాకు, అబేద్నెగో, దానియేలు వలన అన్యులదేశంలో దేవుని నామము ఘనపరచ బడినట్లే, మీ పిల్లలు కూడా అన్యజనుల మధ్య దేవుని నామము ఘనపరచబడేలా జీవిస్తారు కదా! అంటే, అన్యజనుల మధ్య దేవునినామం అవమానపరచబడాలన్నా ఘనపరచబడాలన్నా తల్లిదండ్రుల పెంపకమే కదా కారణం. అంతేకాక, బిడ్డలను దేవునియందు భయభక్తులతో పెంచకపోతే, వారు దొంగలు, నరహంతకులు, వ్యభిచారులుగా మారి సమాజానికి చీడ పురుగుల్లా తయారవుతారు. సమాజం చెడిపోవ డానికి, పాపము విస్తరించడానికి ఒకరకంగా తల్లిదండ్రులే కారణం. మొక్క వంకరగా పెరుగుతున్నప్పుడు, ఒక కర్రకి దానిని కట్టి నిటారుగా నిలబెట్టకపోతే, అది వంకరగానే పెరిగి మ్రానుగా మారి దారికి అడ్డం వస్తుంది. అప్పుడు దానిని నరికివేయడం తప్ప వేరే మార్గంలేదు. మ్రానైన తరువాత దానిని సరిచేయడం అసాధ్యం. తల్లిదండ్రులు ఎంతసేపటికీ బాగా డబ్బు సంపాదించి, ఇతరుల ముందు ఘనంగా బ్రత కాలి అనుకుంటారే తప్ప, దేవుని నామము ఘనపరచబడా లని **'క్రైస్తవులు'** ఎవరూ తమ హృదయాలలో అనుకోవడం లేదు. మా వలన దేవుని నామము ఘనపరచబడాలనుకునే తల్లిదండ్రులు ముందుగా తమ బిడ్డలను ఖచ్చితంగా దేవునిలో పెంచుతారు. తాము ఘనపరచబడాలి అనుకొనే తల్లిదండ్రులు, తమ ఘనతకోసం ఏం చేయాలో వాటి మీద దృష్టిపెడతారే తప్ప పిల్లలను దేవునియందు భయభక్తులతో పెంచడం మీద దృష్టిపెట్టలేరు. తల్లిదండ్రుల నిర్లక్ష్యం వలన పిల్లలు చెడిపోతే, దానికి కూడా పిల్లల మీదనే నింద వేస్తారు. 'మేము వారికి కావలసినవన్నీ సమకూర్చాము, చదువు చెప్పించాము, ఆస్తులు సంపాదించి ఇచ్చాము, అయినా వారు చెడిపోతే మేమేం చేస్తాము' అని 'దేవునియందు భయభక్తులతో పెంచని' తల్లిదండ్రులు తమ తప్పుని కప్పి పుచ్చుకుంటారు. దేవునియందు భయభక్తులు కలిగి ఉండట మంటే, చర్చికి వెళ్ళడం, బైబిలు చదువుకోవడం, ప్రార్థన చేసుకోవడమే కాదు, **'మీ బిడ్డలను దేవుని యందు భయభక్తులతో పెంచుట'** ద్వారా అన్యజనుల మధ్య దేవుని నామము ఘనపరచబడేలా జీవించాలి. **ఇది దేవుని చిత్తమైయున్నది.** **(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లో పీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# కలిగిన వాటితో...

"ధనాపేక్షలేనివారై మీకు **కలిగిన వాటితో** తృప్తిపొంది యుండుడి. నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా" (హెబ్రీ.13:5) అని బైబిల్లో వ్రాయబడి ఉంది. ప్రతి అవసరానికి ధనము కావాలి. ధనము లేనిదే ఏ పని జరగదు అన్నది నిజమే. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండ టానికి కావలసినంత ధనము సమకూర్చుకుంటారు. మరి తరాలు తిన్నా తరగనంత ఆస్తి ఉన్నవాళ్ళకి ఏమి కొరత ఉంటుందని ఎప్పుడూ అశాంతితో ఉంటున్నారు? ఒక్క ధనము విషయంలోనే కాదు చాలా విషయాలలో మనుష్యులు వారి జీవితం పట్ల సంతృప్తి లేకుండానే జీవిస్తున్నారు.

ఈ భూమి మీద బ్రతకాలంటే ఎవరికైనా అవసరమైనవి ఆహారము, వస్త్రాలు, గృహము. ఏ మనిషికైనా ఇవి ప్రాథమిక అవసరాలు. వీటిని సంపాదించుకోడానికి ధనము కావాలి కాబట్టి, ధన సంపాదన కోసం ఉద్యోగమో, వ్యాపారమో చేస్తారు. ఒకవేళ దేవుడు వారికి ఉద్యోగం ఇస్తే సంతోషి స్తారు. తర్వాత ఒక మంచి జీవిత భాగస్వామి కావాలి. దేవుడు బాగా ప్రేమించే మంచి జీవిత భాగస్వామిని ఇస్తే చాలా సంతోషిస్తారు. తర్వాత మంచి పిల్లలు కావాలి. దేవుడు వారికి మంచిపిల్లలను కూడా ఇస్తాడు. వీరంతా నివసించ డానికి మంచి ఇల్లు కూడా ఇస్తాడు. ఇంకేముంటాయి అవసరాలు. సగటు మనిషి కోరుకొనేవన్నీ దేవుడిచ్చిన తర్వాత ఇంకా మనసులో అశాంతి ఉందంటే, ఏదో లోపం ఉందని అర్థము. అదే దేవునికి ఇవ్వవలసిన స్థానము. మన హృదయంలో దేవునికి ఇవ్వవలసిన స్థానం దేవునికి ఇవ్వక పోతే, ఆ స్థానంలో అశాంతి, అలజడి వచ్చి కూర్చుంటాయి.

"అపవిత్రాత్మ ఒక మనుష్యుని వదలిపోయిన తరువాత అది విశ్రాంతి వెదకుచు నీరులేని చోట్ల తిరుగుచుండును. విశ్రాంతి దొరకనందున– నేను వదలి వచ్చిన నా యింటికి తిరిగి వెళ్లుదుననుకొని వచ్చి, ఆ యింట ఎవరును లేక అది ఊడ్చి అమర్చియుండుట చూచి, వెళ్లి తనకంటె చెడ్డవైన మరి యేడు దయ్యములను వెంటబెట్టుకొని వచ్చును; అవి దానిలో ప్రవేశించి అక్కడనే కాపురముండును. అందుచేత ఆ మనుష్యుని కడపటి స్థితి మొదటి స్థితికంటే చెడ్డదగును" (మత్తయి 12:43-45). దేవునికి ఇవ్వవలసిన స్థానము దేవునికి ఇవ్వకపోతే పెనము మీద నుండి పొయ్యిలో పడినట్లు అవుతుంది మన పరిస్థితి.

బైబిల్లో ఒక ధనవంతుడైన యౌవనస్తునికి కూడా ఇలానే మనసు నెమ్మదిలేని స్థితిలో యేసు దగ్గరకు వచ్చాడు. అతను చిన్నతనము నుండి దేవునియందు భయభక్తులతో ఉండి పది ఆజ్ఞలన్నీ తూ.చ. తప్పకుండా పాటిస్తున్నవాడే. అయినా కూడా అతని హృదయములో అశాంతి, అలజడి. నేను 'నిత్యజీవమునకు వారసుడను అవుతానా? లేదా?' అన్న అనుమానం అతనికి నిద్ర లేకుండా చేసింది. యేసు దగ్గరకు వచ్చే వరకు అతని లోపము అతనికి అర్థం కాలేదు. అతని హృదయములో నెమ్మది లేకపోవడానికి కారణం అతని ఆస్తి. దానిని వదిలేసి నన్ను వెంబడించు అని చెప్తే, అతను 'నిత్యజీవము' కంటే ఆస్తినే ఎక్కువగా ప్రేమించడం వల్ల యేసుని వెంబడించలేక పోయాడు. అతడు ఆజ్ఞలన్నీ పాటిస్తున్నాడే కానీ, దేవునికి హృదయములో చోటివ్వలేక పోయాడు. మనము కూడా అంతే ఎన్నో దేవుని కార్యాలు చేస్తుంటాము. అయితే దేవునితో మనకు వ్యక్తిగత సంబంధం ఉండదు. మార్తలాగా దేవునికి పరిచర్య చేయడంలో తల మునకలై ఉంటాము కానీ, మరియలాగా యేసు పాదాల దగ్గర కూర్చుని దేవుని మాటలు వినే **'ఉత్తమమైన'** దానిని ఎన్నుకోము. అందుకే మన హృదయములో 'అశాంతి, అలజడి' ఉంటాయి.

కాబట్టి, ప్రియ సహోదరీ, సహోదరులారా, మనం దేవున్ని అడగకుండానే ఇచ్చిన ఆరోగ్యము, తెలివితేటలు, అడిగితే ఇచ్చిన ఉద్యోగము, మంచి జీవితభాగస్వామి, మంచి పిల్లలతో తృప్తి కలిగి జీవిస్తూ, దేవుడు నీతో, నీ హృదయంలో ఉన్నప్పుడు నీవు సంతోష సమాధానాలతో జీవిస్తావు. దేవుడు మిమ్మును, మీ కుటుంబమును దీవించును గాక!

–ఇట్లు, **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

స్త్రీల విభాగం

# నా కుటుంబము

**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

ఇరవై లక్షలకు పైగా ఉన్న ఇశ్రాయేలు జనాంగమునకు నాయకుడైన యెహోషువ తన కుటుంబంలోని వారందరి మానసిక ప్రవర్తన బాగుగా ఎరిగి యున్నవాడు. కాబట్టి అంతమంది జనాంగంతో "మీరెవరిని సేవింప కోరుకొని ననూ నేను, నా యింటివారును యెహోవాను సేవించు దుము" అన్నాడు.

దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు అని చెప్పి వానికి ఒక కుటుంబము ఏర్పాటు చేశాడు. హవ్వను తయారు చేయగానే వారిద్దరూ పిల్లలను కని భూమిని నింపి దానిని ఏలమన్నాడు.

వీరిద్దరూ కలసి ఉండి భూమిని నింపాలి. అది దేవుని ఆజ్ఞ. తెలివి తేటలతో కాని, భవిష్యత్తులో మానవజాతిని సంరక్షించగలగటానికి గవర్నమెంటు చట్టముకాని, ఎక్కువ చదివాను చాలా అనుభవం నాకు ఉంది అని నేను నా కుటుంబము కొరకు ఏర్పాటు చేసిన ప్రణాళికలో ఏవి మానవ కుటుంబాన్ని సరిగా నడుపలేవు.

మిల్టన్ ఏమి వ్రాశాడో కాని, హవ్వ ఆదాముకు దూరమై ఆదామును విడచి ఒంటరిగా ఉన్నందువల్లనే దేవునికి శాశ్వతంగా దూరమై తన కుటుంబమును దూరం చేసింది.

కుటుంబ క్రమము కొరకు ఇద్దరూ ఒకే చోట, ఒకే ఆఫీసులో ఉద్యోగం అయితేనే చెయ్యాలి లేదా భర్త సంపాద నతోనే కుటుంబమును నడపాలి. ఇద్దరి జీతాలతో చాలా సంపాదించవచ్చు కాని ఏమి పోగొట్టుకుంటామో!?

పదిహేను సంవత్సరాల క్రితం నా ఆఫీసులో పనిచేసే ఆమె ఒకసారి నాతో మాట్లాడుతూ తన స్నేహితురాలు బాగా చదువుకున్నది. ఇద్దరు పిల్లలున్నారు. భర్తకి గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం. కాని తన పుట్టింటి ఊర్లో ఆమెకు ఉద్యోగం వచ్చింది. అందువల్ల కుటుంబాన్ని వదలి నాలుగు వందల కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం చేస్తూ శని, ఆదివారాలు మాత్రమే తన కుటుంబంతో గడపటానికి నిశ్చయించు కుందని చెప్పింది. ఆమె ఎవరో నాకు తెలియకపోయినా నా పేరు చెప్పకుండా ఉత్తరం వ్రాశాను.

"నీ భర్త జీతముతోనే తృప్తిపడి ఇంటివద్దనే ఉండి భర్తను పిల్లలను చూసుకోమని, మనం ఈ లోకంలో కొంతకాలమే జీవిస్తాము. అది కూడా నీడలాంటి మన జీవితం తొందర్లోనే ముగిసిపోతుంది. కనుక డబ్బు, దర్పం, గొప్ప ఇల్లు, ఆస్తి మనకు ఇచ్చే సంతోషం ఏమీ ఉండదు" అని ఉత్తరం వ్రాశాను. మరలా రెండు నెలలు ఆగి మరో ఉత్తరం వ్రాశాను.


పది సంవత్సరాలు గడచిపోయాయి. నా ఆఫీసులో పనిచేసే ఆమె వేరే పనిలోకి వెళ్ళిపోయింది. నేను ఒక ఊరిలో ఒక మీటింగులో మాట్లాడిన తర్వాత ఒక స్త్రీ వచ్చి తన కొరకు ప్రార్థన చెయ్యమని, తన పెనిమిటి తనను తన పిల్లల్ని చూడటం లేదని, వేరే చోట ఉన్నాడని ఏడుస్తూ చెప్పింది. వివరాలు తెలుసుకున్న తర్వాత పది సంవత్సరాల క్రితం నేను ఉత్తరం వ్రాసిన స్త్రీ ఈమేనని తెలుసుకున్నాను.

మానవ జీవితంలో దేవుడు ఒక్కో కుటుంబానికి ఒక్కో ప్రణాళిక ఏర్పాటుచేశాడు. దేవుని ప్రణాళికలో ప్రతి కుటుంబానికి సరిపడే సంతోషకరమైన ప్రణాళికను ఏర్పాటు చేశాడు. ఆయా కుటుంబాలలోని వ్యక్తులందరికి ఒక్కో బాధ్యతను అప్పగించాడు.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - ఫిబ్రవరి-2026

**బావిలో దాగియున్న యొక సింహమును చంపినది ఎవరు? (2సమూయేలు)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు.............................................................

గ్రామము...............బుక్ సీరియల్ నంబరు..........

**జనవరి-2026 ప్రశ్న జవాబు :**
**అబీషై (1సమూయేలు 26:6)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. బి. సరోజిని, గుంతకల్లు, 2. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. వై. సంధ్యారాణి-ఒంగోలు

## చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| **పి.వి.కెరోలిన్, గుంటూరు** | **(12-12-25)** | **10000** |
| ఈ.సి.సుగుణమ్మ, పులివెందుల | (26-12-25) | 5000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (09-12-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (26-11-25) | 2000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ, అనంతపురం | (25-03-24) | 1000 |
| డి. ప్రభావతి, కొడవకల్లు, కృష్ణాజిల్లా | (12-12-25) | 800 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (07-01-26) | 500 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| కె. ప్రభాకర్, వెంకటగిరి | (06-01-26) | 350 |
| సిహెచ్. దయరాజు, రామానుజపురం | (05-11-25) | 350 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

**చిన్నపిల్లల పేజి**

# చూచుచున్న దేవుడు

పట్టణానికి దూరంగా ఉన్న కొండల మధ్యన ఒక చిన్న అందమైన గ్రామం ఉండేది. ఆ గ్రామంలో టోబీ అనే కుర్రాడు ఉండేవాడు. అతడు గొర్రెల కాపరి. టోబీ చాలా తెలివైనవాడు. టోబీ చిన్నవాడు కావడంతో మందను నడిపించుటకు తన స్వరం సహకరించేది కాదు. కాబట్టి తన మందను కాయడానికి ఉపయోగపడే విధంగా ఒక చిన్న చెక్క ఈలను ఉపయోగించేవాడు. కానీ ఆ ఈల కంటే పట్టణంలో దొరికే ఈల శబ్ధం ఎక్కువ దూరం వరకు వెళ్తాదని గ్రహించి ఒక్కొక్క రూపాయి దాచి ఒక వెండి ఈలను కొన్నాడు. దానిని ఎవ్వరికి ఇవ్వక అపురూపంగా చూసుకునే వాడు. గ్రామంలోని అందరూ టోబీ ఈలను గురించి అతని తెలివితేటలను మెచ్చుకునేవారు.

ఆ గ్రామం చాలా చిన్నది కావడంతో గ్రామస్తులందరికి కలిపి ఒక ఉమ్మడి యాపిల్ తోట ఉండేది. గ్రామంలోని ప్రజలందరూ కలిసి దానిని సాగుచేసేవారు. అలాగే పంటను కూడా అందరూ కలిసి పంచుకునేవారు. అందరూ పంచుకోగా మిగిలిన పంటను అవసరతలో ఉన్నవారు తీసుకునే విధంగా ఒక దగ్గర పోగేసి ఉంచేవారు. ఆ పండ్ల వద్ద ఒక చిన్న చెక్క పలక మీద ఒక నియమం ఉండేది. అదేమంటే నీకు అవసరమైనన్ని పండ్లు మాత్రమే తీసు కోవాలి, మరియు పేదల కోసం అక్కడ ఉన్న చెక్క పెట్టెలో మీకు తోచినంత డబ్బు వేయాలి అని.

టోబీ తన తెలివితేటలతో ఒక ప్లాన్ వేశాడు. మధ్యాహ్నం సమయంలో ఆ తోట వైపు ఎవరూ రారని గమనించాడు. “దేవుడు ఈ ప్రపంచాన్ని నడపడంలో చాలా బిజీగా ఉంటాడు, ఆయన రాజులు, రాజ్యాలు, తుఫానులు వంటి వాటిని నియంత్రించడంలో బిజీగా ఉంటాడు కదా. ఒక చిన్న పిల్లాడు డబ్బులు వేయకుండా కొన్ని పండ్లు తీసుకుంటే ఏమౌతుంది? ఆయన ఏమి గమనించదులే” అనుకున్నాడు. అనుకున్నదే తడవు టోబీ గోడ దూకి తోటలోకి వెళ్ళాడు. తనకు అవసరమైనంత వరకే కాక తన జేబులు, చివరకు తన టోపీలో కూడా పండ్లను నింపేసుకున్నాడు. ఒక్క రూపాయి కూడా పెట్టెలో వేయలేదు. ఎవరూ తనను గమనించలేదని సంతోషంతో టోబీ గబగబా గోడ దిగుతుండగా, ఒక్కసారిగా మెల్లని గాలి వీచింది. అది మామూలు గాలిలా కాకుండా, ఎవరో గుసగుసలాడుతున్నట్లు అనిపించింది. టోబీ పైకి చూసినప్పుడు, ఆకుల మధ్య నుండి పడుతున్న సూర్యరశ్మి వేలాది కళ్ళు తనను చూస్తున్నట్లు అనిపించింది. అకస్మాత్తుగా అతనికి వాక్యం గుర్తొచ్చింది. ***“యెహోవా కన్నులు ప్రతి స్థలము మీద ఉండును; చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును”*** (సామెతలు 15:3). కాస్త భయమేసింది. దేవుడు బిజీగా లేడని, తాను పండ్లు దొంగిలించడాన్ని ఆయన చూస్తున్నాడని టోబీకి అర్థమైంది. అయినా తన తప్పును సరిచేసుకొనక ఇంటి ముఖం పట్టాడు టోబీ.

ఇంటికి పరిగెత్తుతుండగా, కాలు జారి కింద పడ్డాడు. పండ్లన్నీ బురదలో పడి పాడైపోయాయి. ఒక్క పండు కూడ తన వద్ద మిగలలేదు సరి కదా, తను ఎంతో కష్టపడి డబ్బులు దాచి కొనుక్కున్న ఈల కూడ కూడ కనిపించడం లేదు. ఎక్కడో తోటలో పడిపోయి ఉంటుందని గ్రహించాడు టోబీ. టోబీ చెంపల మీదుగా కన్నీళ్ళు కారుతున్నాయి. ఏడవడం మొదలుపెట్టాడు. తను చేసిన తప్పు వల్ల వచ్చే ఫలితమే ఇదని అతనికి అర్థమైంది. ఉచితంగా పండ్లు కావాలనుకుని, తన దగ్గర ఉన్న విలువైన వస్తువును పోగొట్టుకున్నాడని గ్రహించిన టోబీ ఏడుస్తూ తోటవైపు కదిలాడు.

ఈల కోసం వెతుక్కుంటూ మళ్ళీ తోట దగ్గరకు వెళ్ళాడు టోబీ. అక్కడ పాస్టర్ గారు నిలబడి ఉన్నారు. ఆయన చేతిలో టోబీ వెండి ఈల ఉంది. టోబీ, ఇది నీదే కదా? అక్కడ చెట్టు కింద దొరికింది అన్నారాయన. తన ఈల దొరికిన సంతోషంలో టోబీ ఏడుస్తూనే తన తప్పును ఒప్పుకున్నాడు.

తన దొంగతనం బయటపడినందున పాస్టర్ గారు తనను తిడతారని భయపడ్డాడు. కానీ ఆయన నవ్వి, "టోబీ, దేవుని న్యాయం మన తప్పును చూపిస్తుంది, కానీ ఆయన కనికరం ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇస్తుంది. నువ్వు ఒక గంట సేపు ఈ తోటలో నాకు సహాయం చెయ్యి, నీ తప్పు సరిపోతుంది. ఇదిగో నీ ఈల" అని వెండి ఈల టోబీకి ఇచ్చారు పాస్టర్‌గారు.

టోబీ ఒక గంటకు బదులు రెండు గంటలు కష్టపడి పనిచేశాడు. పని పూర్తయ్యాక పాస్టర్ గారు నవ్వుతూ ఇప్పటికైనా నీవు చేసిన పని తప్పు అని గ్రహించావా టోబీ? అని అడిగాడు. ఓ అర్థమైంది పాస్టర్‌గారు, దేవుడు మనలను నిత్యం గమనిస్తూ ఉండి, మనం చెడ్డ పని చేయగానే అందుకు తగిన విధంగా మనలను శిక్షస్తాడు పోలీస్ వారి వలె అన్నాడు టోబీ తన ఈలను చూసుకుంటూ.

"నీవు దేవుడిని ఒక పోలీస్ అనుకున్నావు కానీ ఆయన సూర్యుడి లాంటి వారు సూర్యరశ్మి నుండి మనం ఎలాగైతే దాక్కోలేమో, అలాగే దేవుని కనుదృష్టి నుండి మనం తప్పించుకోలేము. కానీ నీవు గ్రహించవలసిందేమిటంటే నీవు అనుకున్నట్లు దేవుడు పోలీస్ వంటివాడు కాదు. ఆయన నీవు తప్పు చేయగానే నిన్ను పట్టుకోవాలని చూడటం లేదు, నీ తప్పులను సరిదిద్దుకొని నీ ప్రవర్తన మార్చుకొని నీలో మంచి గుణాలనే ఫలాలతో జీవించాలని ఆయన నిన్ను గమనిస్తున్నారు" అని చెప్పి ఒక చిన్న బుట్టెడు ఆపిల్ పండ్లను టోబీ చేతికి అందించారు పాస్టరు గారు.

తన ఈలను ఒక చేతిలో, ఆపిల్ పండ్ల బుట్టను మరొక చేతిలో పట్టుకొని సంతోషంగా ఇంటి ముఖం పట్టిన టోబీ దేవుడు నిత్యం మనలను గమనిస్తున్నాడని గ్రహించి ఆ తరువాత మరెన్నడు తన తెలివితేటలను తప్పుగా ఉపయోగించడానికి ప్రయత్నించలేదు.

***" యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన త్రోవల యందు నడుచువారందరు ధన్యులు"***

కీర్తనలు 128:1

## బైబిల్ పద వినోదము-13 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| రా | ఈ | ధ | ర్మ | జ | ను | ప | క | ట్టె | శా | బు | హో | రా | జు | స్త్ర |
| నీ | మ | ను | ము | జా | థ | రా | బో | దె | బి | ఇ | రె | గ్రం | న | మి |
| వు | బో | త్లె | ధిం | ప | గా | క | త | ప్పి | లా | బ్సా | క్కో | పో | క | ద్యా |
| ఏ | దా | దు | పి | తి | మ్న | త్సె | ర | హు | ము | ను | న్హ | ద | కూ | నీ |
| లో | ని | లో | బా | రా | కు | వ్రా | సు | య | యె | బ | ఏ | రు | డి | యు |
| ను | ఏ | యె | హో | షు | వ | కా | న్ని | తొ | ట | రి | వా | న | ష్గ | లు |
| టి | మూ | ప్ర | కా | ర | అ | ము | తో | గ | చే | యు | కో | ట | కు | ష |
| ఫి | దు | త్త | గి | యె | గ్ర | లా | జా | రు | వు | లు | యే | త్రీ | ఒ | నీ |
| లి | ప | డు | ద్యో | రు | న | ట్లు | దె | దా | ది | వా | రా | త్ర | ము | దా |
| ష్ట్రీ | స్వా | నిం | న్య | బ్బ | మా | రు | లీ | ర | ను | బ్దో | అ | ధ్యా | యె | ని |
| యు | స్థ | న్నె | చి | య | నో | యీ | లా | ము | న | కొ | యె | కు | డ | ప్తా |
| లు | ము | పు | షె | లు | హ | యా | సు | నా | మా | లే | తి | లె | నీ | ల |
| ర్గ | ము | యె | ఫె | ను | ను | వ | యో | ర్థి | జీ | బు | మ్నా | మె | ల్ల | సు |
| గా | బు | క్క | లా | మూ | చ | ని | బి | కొ | సి | రు | తు | బీ | జే | ర్దా |
| టో | ప్ర | వ | స | మ్సా | ను | ర్తిం | గి | యి | హో | చె | ద | అ | వు | యొ |

**జవాబులు పంపినవారు :**

1. యం. స్వయంప్రభ–చిలకలూరిపేట, 2. సి.హెచ్. దయరాజు–రామానుజపురం, 3. పి. జెర్మియా–చిన్న రావూరు, 4. బి. సరోజిని–గుంతకల్లు, 5. పి.విజయ కుమారి–ఒంగోలు, 6. జి. మేరి కేథరిన్–ఒంగోలు, 7. టి. క్రిస్టియానమ్మ–నందికొట్కూరు, 8. కె. మార్టిన్‌మధు చరణ్ –పులివెందుల, 9. కె. మేరిపవిత్ర–మంచిర్యాల, 9. రంజిత్ సింగ్‌రామానుజులు–ఒంగోలు, 10. కె. చిన్నయోసేపు–చిన్న దోర్నాల, 11. కె. యేసురత్నం–ఒంగోలు, 12. బి. నెహెమ్యా–చిన్నగంజాం, కె. ప్రభాకర్–వెంకటగిరి, 13. టి. యేసుదయమ్మ–వలపర్ల, 14. కె. అరవింద్–అన్నవరం, 15. బి. ప్రేమలత–నెల్లూరు, 16. యస్. జాన్‌బాబు–ఒంగోలు, 17. వై. సంధ్యారాణి–ఒంగోలు.


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు** – రూ. 250/-
(అపొస్తలుడైన పౌలు కథ – నవల)

**జప్నత్పనేహు** – రూ. 250/-
(యోసేపు కథ – నవల)

**నా చిత్తానుసారుడు** రూ. 250/-
(దావీదు కథ – నవల)

**మిక్కిలి సాత్వికుడు** రూ. 150/-
(మోషే కథ – నవల)

**గోత్రకర్త** (యాకోబు కథ–నవల) రూ. 250/-

# బైబిల్ పద వినోదం - 14

## రూతు - సమూయేలు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| తా | ను | సె | శి | ల | దా | వి | చ్చి | రా | న | ఆ | జ్ఞ | ను | ఒ | ర్శి |
| వ | ట | ను | క్ష | కొ | గో | గై | డు | లీ | మా | క | ఫీ | ప్రా | లు | ద |
| ల | మి | న | యె | బో | ను | హో | ఏ | వా | సం | దా | నె | ర్థ | వ | ర్ఘ |
| క | ఒ | యో | ట్లు | య | న | క | చు | షిం | తో | సు | హా | న | య | దీ |
| రూ | డు | ద | న | జు | పె | హ | టా | న | బ | డు | సు | లు | ల | ద్ధి |
| ర్పిం | తు | అ | ను | ల | కు | ని | లు | క్ష | ము | ళ్ల | క | బ | మృ | ను |
| చు | ట | వ | ల | న | లె | ఆ | న్నా | య | ము | న | ను | స | సం | తో |
| గె | రి | ప | లో | పం | మె | ను | ఆ | లు | నా | చు | హ్లో | షిం | గీ | అం |
| చిం | చు | ము | రా | ట | లీ | ల్యో | స | వే | బ | లు | మ | శ | లు | అ |
| లు | జ్ఞ | మా | ఆ | టె | ఎ | కి | మూ | యో | న్నా | కం | ట | ల్మా | చు | ర్పిం |
| ల్గా | ను | గై | దు | ఓ | కొ | ను | యే | ట | యు | హ | న | ను | పొ | రు |
| గి | న | క్రొ | బో | అ | బే | ళ్ల | లు | బు | యా | మో | చ | నా | ట్టే | జ |
| వ్వు | ప | అ | కా | బీ | ఓ | దు | ర్పిం | స | చు | ట | సూ | ల్కా | హు | నె |
| వి | జ్ఞా | ట | ఈ | యా | ది | ర్శా | మా | టె | న్ని | కం | హొ | ఎ | లో | బె |
| ను | వి | ట | యు | దా | దు | ష్డో | అ | శ్రే | ష్ఠ | ధి | ఫ్నీ | ము | షి | ఎ |

పేరు.......................గ్రామము.......................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు.......................

**'బైబిలు పద వినోదము-14'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| రూతు | హన్నా | ఏలీ | హొఫ్నీ | రామా | మారా |
| ఓర్పా | దాది | శిక్ష | అంగీ | పంట | సన్నిధి |
| దాగోను | సమృద్ధి | గిల్గాలు | నయోమి | ఎల్కానా | కిల్యోను |
| మహ్లోను | పెనిన్నా | షిలోహు | యవలు | పరిగె | కళ్లము |
| బోయజు | శల్మాను | ప్రార్థన | యోవేలు | అబీయా | దాసుడు |
| మోయాబు | అష్డోదు | ఓబేదు | కటాక్షము | ఫీనెహాసు | సమూయేలు |
| దీర్ఘదర్శి | విజ్ఞాపన | సూచన | ఈకాబోదు | ఎలీమెలెకు | ఎబెనెజరు |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ (1సమూ. 15:22)